PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 163 | విజయవాడ, మంగళవారం 14 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 14 January 2025 | Rs


బక్కచిక్కిపోతున్న రూపాయి

- డాలర్‌కు 57 పైసలు పతనమై రూ. 86.61లకు..
- క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై తీవ్ర ప్రభావం

7



ఫొటో : టివి.రమణ



పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

ప్రజాశక్తి

సంక్రాంతి శుభాకాంక్షలు

మంగళవారం మా కార్యాలయానికి సెలవు, కావున బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

-చీఫ్ జనరల్ మేనేజర్

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు



విజయవాడ కృష్ణలంకలో విద్యుత్ బిల్లులు తగులబెడుతున్న వి శ్రీనివాసరావు తదితరులు

3

పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ, ఇతర ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దగ్ధం చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. తాము అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ భారాలూ మోపబోమని టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే మోయలేని విధంగా భారాలు మోపడం దారుణమన్నారు. పేదరిక నిర్మూలన అంటే విద్యుత్ ఛార్జీలు పెంచడమేనా అని ప్రశ్నించారు. రానున్న నెలలకు సైతం భారాలు వేసేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. సెకితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పి4 విధానంలో ప్రజల ఆస్తులను ప్రయివేటు పరం చేసేందుకు ప్రజల భాగస్వామ్యం పేరుతో కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ప్రజలపై పడుతున్న భారాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారకముందే విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని కోరారు.

సరిహద్దు కంచెపై ముదురుతున్న దౌత్య వివాదం

- సరిహద్దుల్లో బిఎస్‌ఎఫ్ కార్యకలాపాలపై బంగ్లా అభ్యంతరం
- బంగ్లా దౌత్యాధికారికి భారత్ సమన్లు

న్యూఢిల్లీ : సరిహద్దులో బిఎస్‌ఎఫ్ కార్యకలాపాలపై బంగ్లాదేశ్ అభ్యంతరం తెలపడంతో మొదలైన వివాదం అంతకంతకూ ముదురుతోంది. సరిహద్దు సంబంధిత అంశాలపై విదేశాంగ శాఖ సౌత్ బ్లాక్‌లోని తన కార్యాలయానికి బంగ్లా దౌత్యవేత్తను సోమవారం రప్పించుకుని ప్రోటోకాల్‌ను అనుసరించే సరిహద్దు వెంబడి కంచెను ఏర్పాటు చేస్తున్నామని చెప్పింది. భారత్ -బంగ్లాదేశ్‌ల మధ్య ఐదు ప్రాంతాల్లో కంచెలు వేయనున్నట్లు హోం మంత్రిత్వ శాఖ సలహాదారు జహంగీర్ ఆలం చౌదరి ఆదివారం మీడియాకు వెల్లడించిన వెంటనే బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను రప్పించుకుని తన అభ్యంతరాన్ని తెలిపింది. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో నిర్మాణాలు ప్రారంభించే ముందు తమను సంప్రదించలేదని, ఇది ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని బంగ్లాదేశ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది జరిగిన మరుసటి రోజే భారత్ కూడా ఈ చర్యలు తీసుకుంది.

గతేడాది ఆగస్ట్ 5న షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత హసీనా పార్టీ అవామీ లీగ్ సభ్యులు, బంగ్లాదేశ్ ప్రజలు సరిహద్దుల్లో నుండి భారత్ భూభాగంలోకి చొరబడుతున్నార భారత ప్రభుత్వం పేర్కొంది.

సంక్షోభంలో మిర్చి రైతు

- భారీగా ధరలు పతనం
- ఎకరాకు గరిష్ఠంగా రూ.లక్షన్నర వరకు నష్టం

5

అట్టహాసంగా కుంభమేళా

15న సెలవు

- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కనుమ పండుగ రోజు (ఈనెల15న బుధవారం) ప్రభుత్వ కార్యాలయాలకు సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. ఈ మేరకు జీఓ ఆర్‌టి నెంబరు 73ని సోమవారం విడుదల చేసింది. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ జనరల్ మేనేజరు, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనరు విజ్ఞప్తి మేరకు 15న బ్యాంక్‌లకు కూడా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు జీఓలో ప్రభుత్వం స్పష్టం చేసింది.



కాళ్ల మండలం పెదఅమిరంలో పందేలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, గంటా శ్రీనివాసరావు



పిఠాపురం పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బరి వద్ద బాహాబాహీకి దిగుతున్న టిడిపి, జనసేన కార్యకర్తలు

భారీగా బరులు

- ఉమ్మడి గోదావరిలో తొలిరోజు 630 బరులు
- రూ.150 కోట్లకు పైగా చేతులు మారిన వైనం
- పందెం రాయుళ్లను ఆకర్షించేందుకు విలువైన బహుమతులు
- పిఠాపురంలో జనసేన, టిడిపి నాయకుల బాహాబాహీ

ప్రజాశక్తి - యంత్రాంగం

పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా, హైకోర్టు నిషేధించినఉమ్మడి గోదావరి జిల్లాల్లో కోడి పందేలకు బ్రేకులు పడలేదు. తొలిరోజు 630 బరుల్లో కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. సుమారు రూ. 160 కోట్లు చేతులు మారినట్లు సమాచారం. బరుల వద్ద పేకాట, గుండాట జోరుగా కొనసాగుతున్నాయి. ఇక మద్యం ఏరులై పారుతోంది. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఓ బరి వద్ద జనసేన, టిడిపి నాయకులు బాహాబాహికి దిగారు. పశ్చిమగోదావరి జిల్లా .కాళ్ల మండలం పెదఅమిరంలో ప్రజాప్రతినిధులే పందేలను ప్రారంభించారు.

ఉమ్మడి పశ్చిమగోదావరిలో తొలిరోజు 400 బరుల్లో కోడి పందేలు సాగాయి. సుమారు రూ.60 కోట్లకుపైగా నగదు చేతులు మారినట్లు సమాచారం. కొందరు టిడిపి, బిజెపి, జనసేన, బిజెపి నాయకులు పోటాపోటీగా కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. కాళ్ల మండలం పెదఅమిరంలో సాగిన బరి రెండు జిల్లాల్లోనే అతిపెద్దదిగా నిర్వహకులు చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ ఇక్కడ కోడి పందేలను ప్రారంభించారు. భీమవరం శివార్లలో గొల్లలకోడేరులోని ఎస్‌పి కార్యాలయానికి వెళ్లే దారిలోనే కోడి పందేల బరి ఏర్పాటు చేశారు. వీరవాసరం మండలంలో కొన్ని కోడి పందేల బరుల వద్ద గెలుపొందిన వారికి ఏకంగా బుల్లెట్ వాహనాలు, యూనికార్న్ వాహనాలను బహుమతులుగా ఇస్తున్నారు.

పందెంరాయుళ్లు రూ.లక్ష చొప్పున 12 పందేలు కాయాలి. ఇందులో గెలిస్తే వారికి బుల్లెట్ బండి లేదా యూనికార్న్ మోటారు సైకిల్ బహుమతిగా ఇవ్వనున్నారు. మరో బరిలో పందేలు ఎక్కువగా గెలిచిన వారికి ఎనిమిది గ్రాములు, నాలుగు గ్రాములు బంగారు కాయిన్స్ కూడా ప్రకటించారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలోనూ ఇలాంటి బహుమతులు ప్రకటించారు. భీమవరం మండలం తాడేరులో నిర్వహించిన పందేల్లో జబర్దస్త్ నటులు పాల్గొని సందడి చేశారు.

ఏలూరు జిల్లాలో ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో పెద్దబరి వద్దకు వెళ్లిన పోలీసులపైనే పందెంరాయుళ్లు ఎదురు తిరిగినట్లు సమాచారం. ముదినేపల్లిలో తహశీల్దార్ కార్యాలయం వెనుకే పందేలు నిర్వహించడం గమనార్హం. మండవల్లి మండలం చావలిపాడులో పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. తెలంగాణ నుండి సుమారు 500 గొర్రెలతో పందెంరాయుళ్లు ఇక్కడికి తీసుకువచ్చి పందేలు నిర్వహించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 230కి పైగా బరుల్లో కోడిపందేలను నిర్వహించారు. సుమారు రూ.100 కోట్లకు పైగా చేతులు మారినట్టు అంచనా. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, కాట్రేనికోన, అల్లవరం, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, సఖినేటిపల్లిలో భారీ బరులను ఏర్పాటు చేశారు. కోడి పందేలతో పాటు పేకాట శిబిరాలు, గుండాటలు పెద్ద ఎత్తున జరిగాయి. ఒక్క కోనసీమలోనే తొలిరోజు రూ.60 నుంచి రూ.70 కోట్ల వరకూ చేతులు మారినట్టు అంచనా. కాకినాడ జిల్లాలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో 35 వరకూ కోడి పందేల శిబిరాలను నిర్వహించారు. పిఠాపురంలోని వైఎస్ఆర్ గార్డెన్స్ లే అవుట్‌లో వేసిన బరి వద్ద టిడిపి, జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెంలోనూ జనసేన, టిడిపి కార్యకర్తలు ఘర్షణకు దిగారు. నిర్వాహకులు కలుగజేసుకుని వారికి సర్ధిచెప్పడంతో ఉద్రిక్తతకు తెరపడింది. ఇదే జిల్లాలో గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, పెద్దాపురం, తుని, కోటనందూరు, జగ్గంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు మండలాల్లో పెద్ద ఎత్తున బరులు, పేకాట శిబరాలను నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు, గోకవరం, సీతానగరం, రాజానగరం, రాయవరం మండలాల్లో మాత్రం బరులు పోటాపోటీగా సాగాయి. తూర్పుగోదావరిలో మొదటి రోజు రూ.20 నుంచి రూ.30 కోట్ల వరకూ పందేలు జరిగినట్టు అంచనా.

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని వినాయకపురం, నెల్లిపాక, చోడవరం గ్రామ శివార్లలో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. గతంలో మండలంలో కోడిపందాలు మారుమూల గ్రామాల్లో, అటవీ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా జరిగేవి. కానీ ఈ ఏడాది జాతీయ రహదారికి ఆనుకొని చోడవరం, నెల్లిపాక గ్రామాల్లో బాహాటంగా నిర్వహించారు.

బాపట్ల జిల్లాలో రేపల్లె, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పెద్ద బరుల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. రేపల్లె నియోజకవర్గం, తూర్పుపాలెంలో దాదాపు 35 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అతి పెద్ద బరుల్లో భారీ ఎత్తున కోళ్ల పందేలు నిర్వహించారు. ఇక్కడి విఐపి బరిలో జరిగిన సంబరాల్లో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తన మిత్ర బృందంతో పాల్గొన్నారు. బాపట్ల నియోజకవర్గం మంతెనవారిపాలెం వద్ద దాదాపు 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పెద్దబరిలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాల్గొన్నారు. తొమ్మిది పోటీల్లో ఐదుసార్లు విజేతగా నిలిచిన పందెంకోళ్ల జట్టుకు బుల్లెట్ బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. వేమూరు నియోజకవర్గంలో క్రాప అడ్డరోడ్డు వద్ద, అనంతవరంలో కోళ్లపందాలు నిర్వహించారు.

సంక్రాంతితో సుఖసంతోషాలు

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగువారికి విశిష్టమైన సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలను తెలియజేశారు. పాడిపంటలతో విరాజిల్లే పల్లె సీమలు మరింత కళకళలాడాలని, ఆధునికతను సంతరించుకున్నా, మరిచిపోని మన సాంప్రదాయాలను ఒడిసిపట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం : డిప్యూటీ సిఎం పవన్



పల్లె సౌభాగ్యమే, దేశ సౌభాగ్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ధాన్యపు రాశులను లొగిళ్లకు మోసుకువచ్చే సంక్రాంతి పండుగకు ప్రజలందరీ శు భాకాంక్షలను తెలియజేశారు..

తెలుగు సంస్కృతికి ప్రతీక : వైసిపి అధినేత జగన్



తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ అందరి కుటుంబాలలో భోగభాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ సంక్రాంతి శు భాకాంక్షలు చెప్పారు.

శాంతి సామరస్యాలు విరాజిల్లాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సంక్రాంతి వేళ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, శాంతి, సామరస్యాలు విరాజిల్లాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాలు తొలినుంచి మత సామరస్యానికి, శాంతి సామరస్యాలకు ప్రతీకగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఇటీవల కాలంలో కొన్ని శక్తులు ప్రజల మధ్య ఉన్న ఈ ఐక్యతను విచ్ఛినం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. సంక్రాంతి సందర్భంగా శాంతి సామరస్యాలను, తెలుగు వారి సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆనందం వెల్లి విరియాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశారు. పాడిపంటలతో రైతులు ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు.

స్టీల్ ప్లాంట్ మూసివేతలో భాగంగానే విఆర్ఎస్ అమలు : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ మూసివేసే కుట్రలో భాగంగానే కార్మికులకు విఆర్ఎస్ ప్రతిపాదన, దరఖాస్తులకు తెరతీశారని, ఇది సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోడీ ఇస్తున్న కానుకని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకూ ఉద్యోగులు, కార్మికులు విఆర్ఎస్‌కు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామంటూ యాజమాన్యం ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. . గత నాలుగు నెలలుగా ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో వారికి రూ.250 కోట్లు బకాయిలు పేరుకుపోయినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఫ్యాక్టరీలో ఉత్పత్తి తగ్గిస్తున్నారని, గనులు కేటాయించాలని కోరితే, దాన్ని పక్కనపెట్టి అనకాపల్లిలో నెలకొల్పే మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించారని వెల్లడించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారంలో లేనప్పుడు చాలా గట్టిగా మాట్లాడారని, అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్క మాట కూడా మాట్లడటం లేదన్నారు. ఇటీవల ప్రధాని విశాఖకు వస్తే ఆ సభలో కనీసం స్టీల్ ప్లాంట్ గురించి ఒక్క మాట మాట్లాడలేకపోయారని తెలిపారు.

నా భద్రతలో బాషా ఉండేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో జగన్ హౌస్‌మోషన్ పిటిషన్
- విచారణ 17కి వాయిదా

ప్రజాశక్తి - అమరావతి

లండన్‌లో చదువుతున్న తన కుమార్తె స్నాతకోత్సవం కోసం ఆ దేశం వెళుతున్న సందర్భంగా తన భద్రతా బృందంలో డిఎస్‌పి ఎస్.మహబూబ్ బాషా ఉండేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర హౌస్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ న్యాపతి విజయ్ సోమవారం విచారణ చేపట్టారు. వైఎస్ జగన్ తరపు సీనియర్ లాయర్ ఎస్. శ్రీరామ్ వాదిస్తూ, మంగళవారం జగన్ లండన్ వెళతారని, ఈ నెలాఖరు వరకు అక్కడే ఉంటారని చెప్పారు. జగన్‌కు ప్రాణహాని ఉన్నందున జెడ్ ప్లస్ భద్రత ఉందని, విదేశానికి వెళుతున్నందున ప్రొటోకాల్ మేరకు సెక్యూరిటీని రాష్ట్రమే కల్పించాలని అన్నారు. గతంలో తన భద్రతా బృందంలో ఉన్న మహబూబ్ బాషాను ప్రస్తుతం కూడా కొనసాగించాలని జగన్ ఈ నెల 9న ప్రభుత్వానికి వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, ఎల్లోబుక్ ప్రకారం తనకు నిర్దిష్ట వ్యక్తినే భద్రతాధికారిగా ఇవ్వాలని కోరేందుకు పిటిషనర్‌కు హక్కు లేదన్నారు. భద్రతా సిబ్బంది కేటాయింపు విషయంలో రాష్ట్రానికే కాకుండా కేంద్ర హోం, విదేశీ వ్యవహారాల శాఖలు కూడా తుది నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. విచారణను ఈ నెల 17కి వాయిదా వేయాలని కోరగా, అందుకు జగన్ న్యాయవాది అంగీకారం తెలియజేశారు. విచారణ 17న జరగనుంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు దైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చంద్రబాబు వైఫల్యాలకు పవన్ కామెడీ : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థ సినిమా తరహాలో కొనసాగిస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. గుంటూరులో తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు వైఫల్యాలకు పవన్ తన కామెడీతో వండి వారుస్తున్నారని విమర్శించారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు చనిపోతే క్షమాపణ చెబితే సరిపోతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు.

నారావారిపల్లెలో పలు అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో పలు అభివృద్ధి పనులకు సిఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ. 4.27 కోట్లతో నిర్మించనున్న 33/కెవి సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. జాతీయ ఉపాధి హామీ చట్టం కింద నారావారిపల్లి గ్రామ పరిధిలోని మూడు సచివాలయల పరిధిలో 26 అభివృద్ధి పనులు రూ.3.21కోట్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు.

శ్రీసిటీ సౌజన్యంతో ఎ.రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా రూ.1.10 కోట్లతో అభివృద్ధి చేసేందుకు పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పి ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఎఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామాగ్రి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. నారావారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలలోని ఐదేళ్ల లోపు పిల్లలకు మంచి భవిష్యత్తును అందించడానికి కేర్ అండ్ గ్రోత్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. గ్రామీణ మహిళలు ఇంటి వద్ద నుండే కిరాణా షాపులకు వస్తువులను సరఫరా చేసే సౌలభ్యం కల్పించడానికి ఈజీమార్ట్, డిఆర్‌డిఎ వెలుగు సంస్థ మధ్య ఒప్పంద కుదుర్చుకున్నారు. నారావారిపల్లి సమీపంలోని ఐదు గ్రామాల్లోని 200 మంది మామిడి రైతులతో ఎఫ్‌పిఒ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి అందజేశారు. ప్రభుత్వ స్కీంల



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి, మంత్రి లోకేష్

వినియోగంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మార్కెటింగ్ అనుసంధానంతో బిగ్ బాస్కెట్, రిలయన్స్, ప్రాసెసింగ్ యూనిట్లకు నేరుగా మార్కెటింగ్ చేసుకోవడం వలన మధ్యవర్తులు లేకుండా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ప్రైమరీ ప్యాకింగ్ అండ్ గ్రేడింగ్ చేసుకుని నేరుగా వారు అమ్ముకునేందుకు ఈ ఎఫ్‌పిఒ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం సూచించారు కార్యక్రమంలో జిల్లా ఎపిఎంఐపి అధికారి సతీష్, సిఎండి ఎపి ఎస్‌పిడిసిఎల్ సంతోష్ రావు, పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, జిల్లా మహిళ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, కేర్ అండ్ గ్రో ఫౌండర్ డాక్టర్ మేఘన, డిఆర్‌డిఎ వెలుగు పీడీ శోభన్ బాబు, ఈజీమార్ట్ ఫౌండర్ అండ్ సిఇఒ వెంకట్ నల్లపాటి, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల సందర్భంగా నారావారిపల్లెలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చంద్రబాబు నాయుడు మనవడు దేవాన్ష్ పాల్గొన్నారు. ఈ పోటీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, బాలకృష్ణ భార్య వసుంధర, వారి కుటుంబ సభ్యులు తిలకించారు. క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు.

మళ్లీ మొదటికే!



కృష్ణా జిల్లా కోడూరు మండలం న్యూ ఇరాలి డ్రెయిన్‌పై శిథిలమైన అవుట్‌ఫాల్ స్లూయిజ్

- ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు బ్యారేజీ నిర్మాణాలకు తిరిగి అంచనాలు
- గతంలో రూ.4,761.81 కోట్లతో ప్రతిపాదనలు
- తాజాగా సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వ 4పి పాట

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

ప్రకాశం బ్యారేజీ దిగువన మరో రెండు బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదన మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో ఈ రెండు ప్రాజెక్టులకూ రూ.4,761.81 కోట్లతో డిపిఆర్‌ను జలవనరుల శాఖ సిద్ధం చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఈ రిపోర్టును పక్కనబెట్టింది. 2024 అక్టోబర్‌లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని 15 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా తట్టుకునేలా తిరిగి డిపిఆర్‌ను రూపొందించాలని నిర్ణయించింది. ఈ బ్యారేజీల నిర్మాణానికి మూడోసారి సమగ్ర నివేదిక సిద్ధం చేయడానికి జలవనరుల శాఖ రంగం సిద్ధం చేసింది. 2017 నుంచి ఈ ప్రాజెక్టులు నివేదికలకే పరిమితమవుతోంది. డిపిఆర్ సవరణల పేరుతో పాలకులు కాలయాపన చేస్తున్నాయి. మరోపక్క సముద్రతీర ప్రాంతంలోని భూములకు ముంపు బెడద తప్పించేందుకు రూ.3,044.50 కోట్లతో ప్రతిపాదించిన ఏడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణాలకు నిధులు విడుదలలోనూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. తాజాగా సాగునీటి రంగంలోనూ పబ్లిక్ ప్రయివేటు పీపుల్స్ పార్టనర్‌షిప్ (పిపిపిపి)ను తీసుకొస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ఈ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఏ పద్ధతిలో చేపడతారనేది చర్చనీయాంశమైంది. కృష్ణా నది వరదలకు సముద్రంలో కలుస్తున్న నీటి నీటిని సద్వినియోగం చేసుకోవడానికి, తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు, భూగర్భ జలాల్లోకి సముద్రపు ఉప్పు నీరు చొచ్చుకురాకుండా నివారించేందుకు ప్రకాశం బ్యారేజీకి 16 కిలోమీటర్ల దిగువన పెనమలూరు మండలం చోడవరం వద్ద, 67 కిలోమీటర్ల దిగువన మోపిదేవి మండలం బండికోళ్లలంక వద్ద రెండు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి తొలుత 2017లో జలవనరుల శాఖ డిపిఆర్ సిద్ధం చేసింది. ఇది కార్యరూపం దాల్చలేదు. 2023లో వైసిపి ప్రభుత్వం చెక్‌డ్యామ్‌ల ప్రతిపాదనను పక్కనపెట్టింది. రూ.2,235.42 కోట్లతో చోడవరం వద్ద 5.3 టిఎంసిలు, రూ.2,526.39 కోట్లతో బండికోళ్లలంక వద్ద 4.7 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో బ్యారేజీలకు డిపిఆర్ సిద్ధం చేసింది. రూ.204.37 కోట్లకు పాలనా ఆమోదం ఇచ్చింది. అయితే, నిధులు విడుదల చేయలేదు. దీంతో, డిపిఆర్ మినహా ఒక్కడుగూ ముందుకు పడలేదు. దీంతో, వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది.

డ్రెయిన్లపై అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల విషయంలో నిర్లక్ష్యం

భారీ వర్షాలు కురిసినా పంట పొలాలు ముంపునకు గురవ్వకుండా రక్షించడంలో డెల్టా ప్రాంతంలో డ్రెయిన్లు కీలకం. ఈ డ్రెయిన్లు సముద్రంలో కలిసే ప్రాంతంలో గతంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు నిర్మించారు. సముద్రపు నీరు ఎగువకు డ్రెయిన్లలోకి రాకుండా అడ్డుకుంటూ, ఎగువ నుంచి అధికంగా వచ్చిన నీటిని దిగువన సముద్రంలోకి మళ్లించడానికి ఏర్పాటు చేసిన స్లూయిజ్ రెగ్యులేటరీ వ్యవస్థ పూర్తిగా శిథిలమైంది. దీంతో, కోడూరు, నాగాయలంక, బందరు మండలాల్లోని వేలాది ఎకరాల వ్యవసాయ భూములు సముద్రానికి పోటు వచ్చినప్పుడు ముంపునకు గురవుతున్నాయి. రత్నకోడు, న్యూ ఇరాలీ డ్రెయిన్, లింగన్నకోడు, సాగ కాలువ, కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిజ్, మేకల కాలువ, ఉప్పు కాలువ పరివాహక ప్రాంతంలోని ఏడు వేల ఎకరాలు సముద్రపు నీటితో ఏటా ముంపు బారినపడుతున్నాయి. దీంతో ఈ భూముల్లో పంటల సాగు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రూ.3,044.50 కోట్లతో ఏడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణ ప్రతిపాదనలు నాలుగేళ్ల క్రితం తయారు చేశారు. ఇవి కూడా కాగితాలకే పరిమితమయ్యాయి. తాజాగా నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పిపిపిపి విధానాన్ని తీసుకొస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రెండు బ్యారేజీలు, ఏడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు నిర్మాణాన్ని ప్రభుత్వం ఎలా ముందుకు తీసుకెళ్తుందో చూడాలి.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. విజయవాడలోని కెవిపిఎస్ రాష్ట్ర కార్యాలయం పూలే అంబేద్కర్ భవన్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ... విద్యుత్ చార్జీల పెంపు లేదంటూ కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.16 వేల కోట్లు భారాన్ని వేసిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని కోరారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో చిన్నారికి హెచ్ఎంపివి పాజిటివ్..

పాండిచ్చేరి : పుదుచ్చేరిలో మరో చిన్నారికి హెచ్ఎంపివి పాజిటివ్‌గా నిర్ధారణైనట్లు ఉన్నతాధికారి ఒకరు సోమవారం ప్రకటించారు. ప్రస్తుతం ఆ చిన్నారి పుదుచ్చేరిలోని కేంద్ర ప్రభుత్వానికి చెందిన జిప్మర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బాలిక దగ్గు, జ్వరం, జలుబుతో కొద్ది రోజుల క్రితం జిప్మర్‌లో చేరిందని పుదుచ్చేరి ఆరోగ్య డైరెక్టర్ వి. రవిచంద్రన్ ఆదివారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారి కోలుకుంటుందని, అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. గతవారం పుదుచ్చేరిలో మొదటి హెచ్ఎంపివి కేసు వెలుగుచూసింది. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి చికిత్స అనంతరం శనివారం డిశ్చార్జ్ అయిందని సంబంధిత అధికారులు తెలిపారు. పూర్తి అప్రమత్తతో అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు.

మార్చి 6న ఎఎన్‌యులో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యావిభాగం ఆధ్వర్యంలో మార్చి 6, 7 తేదీలలో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. గంగాధరరావు ఆవిష్కరించారు. 'ఎడ్యుకేషనల్ ఫర్ స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు వచ్చిన పరిశోధన పత్రాలు పరిశీలించి పబ్లికేషన్ తీసుకొస్తామని తెలిపారు.

బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా రెక్టర్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యా విభాగం బిఓఎస్ చైర్ పర్సన్ డాక్టర్ శివలక్ష్మి, అతిథి అధ్యాపకులు డాక్టర్ సందీప్, డాక్టర్ వసంతరావు, డాక్టర్ శివరామిరెడ్డి, పరిశోధకులు ఆలీ భాష తదితరులు పాల్గొన్నారు.

40 మూగజీవాలు మృతి : గొర్రెల కాపరి కూడా..

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా వినుకొండలో గొర్రెల మందపైకి ఆర్‌టిసి బస్సు దూసుకెళ్లడంతో 40 మూగజీవాలు మృతి చెందాయి. కాపరి కూడా మరణించారు. స్థానికుల కథనం మేరకు..కొత్తపాలెం గ్రామానికి చెందిన కుర్ర తిరుపతయ్య (18) తన గొర్రెలను ఇంటికి తోలుకుని వెళ్తుండగా.. కొత్తపాలెం గ్రామ సమీపం కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై వినుకొండకు చెందిన ఆర్‌టిసి గొర్రెల మందపై నుంచి దూసుకువెళ్లింది. తిరుపతయ్యతో పాటు 40 మూగజీవాలు మృతి చెందాయి. మరో పది గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వినుకొండ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐఇడి పేలి పదేళ్ల బాలికకు గాయాలు

రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ఐఇడి పేలడంతో (పేలుడు పదార్థం) పదేళ్ల బాలిక గాయపడినట్లు పోలీసులు సోమవారం ప్రకటించారు. ఆదివారం సాయంత్రం చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం గ్రామ శివార్లలో ఈ ఘటన జరిగిందని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ప్రమాదవశాత్తు బాలిక ఐఇడిపై కాలువేయడంతో ఒత్తిడికి ఐఇడి పేలిందని చెప్పారు. తీవ్రంగా గాయపడిన బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని తెలిపారు.



విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం ప్రాంతంలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు



అనంతపురంలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

- భారాలు ఉపసంహరించాలని నిరసన
- ఛార్జీలు పెంచబోమని చెప్పి మాట తప్పిన టిడిపి కూటమి

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. తాము అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ భారాలూ మోపబోమని టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే మోయలేని విధంగా భారాలు మోపడం దారుణమన్నారు. ట్రూ అఫ్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

అనంతపురం జిల్లా తాడిపత్రిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి రాగానే సర్దుబాటు పేరుతో ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమన్నారు. రానున్న నెలలకు సైతం భారాలు వేసేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. కర్నూలులో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కర్నూలు అంబేద్కర్ సర్కిల్, మండి బజార్ సర్కిల్, జొహరాపురం, శ్రీరాం నగర్‌తో పాటు కోడుమూరు, హోళగుంద, కర్నూలు మండలం ఉల్చాల, ఆదోని, ఆలూరు, ఆస్పరి, గూడూరు, గోనేగండ్ల, పత్తికొండ తదితర ప్రాంతాల్లో భోగి మంటల్లో కరెంట్ బిల్లులను దహనం చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం విస్సాకోడేరులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం పాల్గొని మాట్లాడారు. భీమవరం పట్టణంలో పలుచోట్ల నిరసన తెలిపారు. వీరవాసరం, పెనుమంట్ర, ఆచంట, ఆకివీడు, కాళ్ల, తాడేపల్లిగూడెం, తణుకు, గణపవరం, పెనుగొండ, యలమంచిలి, పాలకొల్లు, నరసాపురం, పెంటపాడు, తణుకు, ఇరగవరం మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఏలూరు జిల్లాలో పలుచోట్ల విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

కాకినాడ జిల్లా కాకినాడ నగరంలోని 37వ డివిజన్ సుందరయ్య భవన్ వీధిలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. పెద్దాపురం పట్టణం, కాకినాడ రూరల్ మండలం చీడిగ, సామర్లకోటలో ఈ కార్యక్రమాలు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని గోరక్షణ పేట వద్ద, రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, కడియం, వేమగిరిలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. గుంటూరు సిపిఎం కార్యాలయం వద్ద, తాడేపల్లి, తాడేపల్లి రూరల్ మండలం గుండిమెడ, కుంచనపల్లి, ఉండవల్లి, మంగళగిరి, తెనాలి, దగ్గిరాల, కొల్లిపర తదితర మండల కేంద్రాల్లో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఉండవల్లిలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మున్నూరు భాస్కరయ్య పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పాలపాడు, నరసరావుపేట పట్టణంతో పాటు నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లోని పలు గ్రామాలలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. చిలకలూరిపేటలోని సిపిఎం కార్యాలయం ఎదుట భోగి మంటల్లో బిల్లులను దహనం చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. క్రోసూరు, అమరావతి, శావల్యాపురం మండలం వేల్పూరులో నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేశారు. పాలకొండ, సాలూరు, సీతానగరం,మక్కువ లో బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. విజయనగరం జిల్లా విజయనగరంలోని పలు ప్రాంతాలు, బొబ్బిలి, నెల్లిమర్ల, రేగడి, ఎస్.కోట, గజపతినగరం, వేపాడ మండలాల్లో నిరసనలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం నగరం, మందస, టెక్కలి, సోంపేట, ఆమదాలవలసలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

కృష్ణా జిల్లా గన్నవరం, ఉంగుటూరు, చల్లపల్లి మండలాల్లో నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 25 చోట్ల భోగి మంటల్లో దహనం చేశారు. తిరుపతి జిల్లాలో రేణిగుంట, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి, పుత్తూరు, కోట, సూళ్లూరుపేట, కెవిబిపురంలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఉమ్మడి కడప, ప్రకాశం జిల్లాల్లో నిరసనలు తెలిపారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం ప్రాంతంలో 1386 రోజులుగా జరుగుతున్న స్టీల్ పరిరక్షణ ఉద్యమ దీక్షా శిబిరం వద్ద భోగిమంట వేసి, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కంచరపాలెం, అక్కయ్యపాలెం, గాజువాక, ఆరిలోవ బిఎన్ఆర్.నగర్‌లో, అనకాపల్లి జిల్లా అనకాపల్లి, మునగపాక, చోడవరం, పరవాడ, కశింకోట, కె.కోటపాడు, అచ్యుతాపురం, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో, అల్లూరి జిల్లాలో విఆర్.పురం, చింతూరు, ఎటపాక, పాడేరు, అరకులోయ, విఆర్.పురం మండలం సున్నంవారిగూడెం గ్రామంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల పత్రులను, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కడప జిల్లా వేంపల్లెలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే జిఒ 22ను కాంగ్రెస్ ఆధ్వర్యంలో భోగి మంటల్లో దహనం చేశారు.

ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ, ఇతర ఛార్జీలు రద్దు చేయాలి

- సిపిఎం డిమాండ్

పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ, ఇతర చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ కృష్ణలంకలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ నాయకులు దోనేపూడి కాశీనాథ్, తదితరులతో కలిసి భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రజలపై పడుతున్న భారాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదానీ, షిరిడి సాయి సంస్థలను ఉద్ధరించడానికే వీటిని ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సెకీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని కోరారు. పి3 విధానంలో ప్రభుత్వ ఆస్తులను ప్రయివేట్ పరం చేశారని, తాజాగా పి4కు సిద్ధమయ్యారని తెలిపారు. పి4 విధానంలో ప్రజల ఆస్తులను ప్రైవేటు పరం చేసేందుకు ప్రజల భాగస్వామ్యం పేరుతో కుట్ర పన్నుతున్నారని చెప్పారు. ఈ విధానం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పనికొచ్చేది కాదని స్పష్టం చేశారు. అనిల్ అంబానికి విశాఖలో 1,400 ఎకరాలు ఇస్తామనం రాష్ట్రాన్ని దివాలా తీయించడమేనన్నారు. సిపిఎం తరుపున ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ..విద్యుత్ చార్జీల పెంపునకు ప్రత్యక్షంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, పరోక్షంగా జగన్‌హన్‌రెడ్డి, మోడీ బాధ్యత వహించాల న్నారు. ఈ స్మార్ట్ మీటర్లు అదానిని ఉద్ధరించడానికేనని, వీటితో గంటకో రేటు వసూలు చేయాలనే కుట్ర దాగుందని తెలిపారు. దోనేపూడి కాశీనాథ్ మాట్లాడు తూ.. పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలపై రూ.16 వేల కోట్లు భారం మోపిందన్నారు. ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మారకముందే విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిబాబు, కల్యాణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ఐపిఎస్ అధికారుల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేహౌండ్స్ అసిస్టెంట్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న నవ్యజ్యోతి మిశ్రా (ఆర్ఆర్2021)ను చింతపల్లి ఎఎస్‌పిగా బదిలీ చేశారు. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న మనజ్‌రామనాథ్ హెగ్డే (ఆర్ఆర్ 2022)ను రాజంపేట ఎఎస్‌పిగా, గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న మందా జావలి అల్ఫన్స్ (ఆర్ఆర్ -2022) నంద్యాల ఎఎస్‌పిగా బదిలీ అయ్యారు. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న పాటిల్ దేవరాజ్ మనీషాను (ఆర్ఆర్-2022) కాకినాడ ఎఎస్‌పిగా, గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా (ఆర్ఆర్-2022) పనిచేస్తున్న రోహిత్ కుమార్ చౌదరిని తాడిపత్రి ఎఎస్‌పిగా ప్రభుత్వం బదిలీ చేసింది.

జగన్ విధానం బెదిరించడం, కక్ష కట్టడం : మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బెదిరించడం, కక్ష కట్టడాలే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విధానాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌కు కనీసం ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు చేసినప్పటికీ ఆయన వ్యవహారశైలిలో మార్పు కనబడటం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎగ్గొట్టిన సబ్సిడీలన్నింటిని తమ ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. 4,56,873మంది రైతులు పండించిన 28,83,238 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం ద్వారా రూ.6,569.84 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ధాన్యం డబ్బులను 2, 3 నెలలకు కూడా రైతుల ఖాతాల్లో సరిగా పడేవి కావని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

కలగానే కనిగిరి నిమ్జ్

- ఇప్పటికీ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాని వైనం



నిమ్జ్ ఏర్పాటు చేయాలనుకున్న ప్రాంతం

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

కనిగిరి నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్) కలగానే మిగిలింది. పరిశ్రమల కోసం సేకరించిన భూమి ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తోంది. యుపిఎ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఆ తర్వాత కేంద్రంలో వరుసగా మూడు దఫాలు అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం దీన్ని అటకెక్కించింది. ఈ ప్రాంత ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి పార్టీ అభ్యర్థీ తన మేనిఫెస్టోలో కనిగిరి నిమ్జ్‌ను పెట్టుకోవడం, గెలిచాక దాన్ని పట్టించుకోకపోవడం పరిపాటైంది. అప్పట్లో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కృషి ఫలితంగా ఇక్కడ నిమ్జ్ ఏర్పాటుకు యుపిఎ ప్రభుత్వం ప్రకటన చేసింది. ఆ తర్వాత కేంద్రంలో అధికార మార్పిడి జరగడంతో యుపిఎ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రకటించిందనే నెపంతో ఎన్‌డిఎ ప్రభుత్వం దీన్ని పూర్తిగా పక్కనబెట్టేసింది.

14,231 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక

కనిగిరి నియోజకవర్గం అన్ని రకాలుగా వెనుకబడి ఉంది. ఉపాధి కోసం ఈ ప్రాంతం నుంచి వలసపోతున్నారు. ఫ్లోరిన్ పీడిత ప్రాంతం కావడంతో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ పారిశ్రామిక ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటుతో ఉపాధి పెంచాలనే నిర్ణయాన్ని అప్పట్లో యుపిఎ ప్రభుత్వం పీసీపల్లి, పామూరు మండలాల్లో 14,231 ఎకరాల్లో నిమ్జ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రూ.43,700 కోట్ల పెట్టుబడులు ఇక్కడ పెట్టేలా ప్రణాళిక రూపొందించారు. ప్రత్యక్షంగా, పరోక్షం 2.5 లక్షల మందికి ఉపాధి కల్పన చేయవచ్చని అంచనా వేశారు. రూ.24 వేల కోట్ల విలువైన ఉత్పత్తులను ఇక్కడ నుంచి రామాయపట్నం పోర్టు ద్వారా ఎగుమతులు చేయవచ్చని భావించారు. భూసేకరణ జరిగినా ఇక్కడ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కానందున లక్ష్యాలు కాగితాలకే పరిమితమయ్యాయి.

పీసీపల్లిలో వెయ్యి ఎకరాల్లో ప్లాట్లు, రహదారులు

పీసీపల్లి మండలంలో కందుకూరు-పామూరు రహదారిలో మాలకొండ సమీపంలో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎపిఐఐసి ప్లాట్లు, తారురోడ్లు వేసింది. రబ్బరు, ఆటోమొబైల్, స్థానికంగా ఉండే ఖనిజాల ఆధారంగా పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొస్తే భూములు ఇవ్వడానికి సిద్ధమైంది. అనుకూలమైన రవాణా వ్యవస్థ ఈ ప్రాంతంలో ఉంది. పోర్టుకు వెళ్లేందుకు రోడ్లు కూడా ఉన్నాయి. ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో పరిశ్రమలు రాలేదు.

ఇటీవల ఎన్నికల్లోనూ చంద్రబాబు హామీ

గతేడాది జరిగిన ఎన్నికల్లో కనిగిరి నిమ్జ్‌పై టిడిపి, వైసిపి హామీలు ఇచ్చాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కనిగిరి సభలో నిమ్జ్‌ను చేపడతామని ప్రకటించారు. గతంలో ఈ పరిశ్రమ కోసం కృషి చేసిన ఉగ్రనరసింహారెడ్డి ప్రస్తుతం కూడా ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నిమ్జ్‌ను ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ పరిశ్రమలు వస్తే తమకు ఉపాధి లభిస్తుందనే ఆశతో ఆ ప్రాంత యువత ఉంది.

భూకబ్జాలపై చర్యలు తీసుకోవాల్సిందే

- సెల్ టవర్ ఎక్కి వ్యక్తి నిరసన

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

వైసిపి ప్రభుత్వ హయాంలో దళిత, గిరిజన భూములను వైసిపి నాయకులు ఆక్రమించుకున్నారంటూ, దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదంటూ సోమవారం ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శింగరాయకొండకు చెందిన పఠాన్ ఖాన్ భాయ్ అభ్యుదయ భావాలు ఉన్న వ్యక్తి. లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నారు. వైసిపి హయాంలో ఆ పార్టీ నాయకులు కొంతమంది భూ కబ్జాలకు పాల్పడ్డారని, ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన పడుతూ ఉండేవారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వమూ పట్టించుకోవడంలేదని ఆకస్మాత్తుగా చందమామ రెస్టారెంట్ పక్కన ఉన్న సెల్ టవర్ ఎక్కారు. భూకబ్జాదారులను అంతం చేయాలని నినాదాలు చేశారు. వైసిపి భూకబ్జాదారుల జాబితా అక్కడ ఒక కాగితం మీద రాసి అంటించి సెల్ టవర్ పైకి ఎక్కారు. స్థానికులు ఎస్ఐ బి మహేంద్రకు సమాచారం తెలిపారు. ఆయన పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఫైర్ ఇంజన్‌ను రప్పించారు. సెల్ టవర్ దిగి ఫిర్యాదు చేస్తే భూకబ్జాదారులపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు. దీంతో పఠాన్ ఖాన్ భాయ్ కిందకు వచ్చి పోలీసులకు వైసిపి నాయకులపైన ఫిర్యాదు చేశారు.



సెల్ టవర్ దిగుతున్నపఠాన్ ఖాన్ భాయ్

రెండు ఆర్‌టిసి బస్సులు ఢీ

- 30 మందికి గాయాలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తిరుపతి- పీలేరు మార్గమధ్యంలోని భాకరాపేట కనుమ రహదారి మొదటి మలుపులో రెండు ఆర్‌టిసి బస్సులు ఢీకొన్నాయి. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో సుమారు 30 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మదనపల్లి నుండి తిరుపతికి వస్తున్న మదనపల్లి ఎక్స్‌ప్రెస్ ఆర్‌టిసి బస్సు... తిరుపతి నుంచి పీలేరుకు వెళుతున్న బస్సు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మదనపల్లి ఆర్‌టిసి బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. పోలీసులు అతికష్టం మీద ఆయనను బయటకు తీశారు. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.



ఎదురెదురుగా ఢీకొన్న ఆర్‌టిసి బస్సులు



నెల్లూరులో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి-కోవూరు

సంక్రాంతి సందర్భంగా నెల్లూరు జిల్లా కోవూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. బాపట్ల, ఒంగోలు, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి, నెల్లూరు జిల్లాల నుంచి వచ్చిన ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మొదటి బహుమతిని ఎస్ఎస్ బ్రదర్స్ (నెల్లూరు), రెండో బహుమతిని వరసిద్ధి వినాయక పొట్టేపాళెం (నెల్లూరు), తృతీయ బహుమతిని చాముండేశ్వరీ సీ ఫుడ్స్ గంగపట్నం (నెల్లూరు) ఎడ్లు గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ. 40,000, రెండవ బహుమతి రూ. 25,000, మూడవ బహుమతి రూ.20,000 విజేతలకు ఇచ్చారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ముగిసిన పడవ పోటీలు

- జంగారెడ్డిగూడెం జెంట్స్, పల్నాడు థండర్స్ విజేతలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం(డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)

సంక్రాంతి సంబరాల్లో భాగంగా కేరళను తలపించేలా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో మూడ్రోజుల పాటు జరిగిన పడవ పోటీలు సోమవారంతో ముగిశాయి. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ పేరుతో ఈ పడవ పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌లో జంగారెడ్డిగూడెం జెంట్స్, పల్నాడు థండర్స్, ఎన్‌టిఆర్ ఈగల్స్ జట్లు తలపడ్డాయి. జంగారెడ్డిగూడెం జెంట్స్, పల్నాడు థండర్స్ పడవలు ఒకే సమయానికి గమ్యానికి చేరుకున్నాయి. పలు రివ్యూల అనంతరం ఇరువురినీ విజేతలుగా అంపైర్లు ప్రకటించారు. ఇరువురికి రూ.లక్ష చొప్పున నగదు బహుమతితో పాటూ ట్రోఫీని ఎమ్మెల్యే అందించారు. తరువాత స్థానంలో నిలిచిన ఎన్‌టిఆర్ ఈగల్స్ జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి అందించారు. చివరిరోజు పడవ పోటీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో వీక్షకులు వచ్చారు. శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఫైనల్ పోటీలను ప్రారంభించారు.

వాస్తవాలు తెలుసుకుని రాయండి

- సోషల్ మీడియాలో వస్తున్న అసత్య వార్తలను నమ్మొద్దు : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల విషయంలో ఒకటికి రెండుసార్లు పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుంచి వాస్తవ సమాచారాన్ని తెలుసుకుని వార్తలు రాయాలని మీడియాకు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు సూచించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో సోమవారం టిటిడి ఇఒ, టిటిడి అదనపు ఇఒలతో కలసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ నాయుడు మాట్లాడుతూ శ్రీవారి యాత్రికులకు మరింత మెరుగైన, పటిష్టమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు పాలక మండలిలో సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలకమండలి నిర్ణయాలు అమలు చేయడంలో కొన్ని సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతుండవచ్చునేమో కాని, సేవలు అందించడంలో ఆలస్యం అవుతోందని అసత్య ప్రచారం చేయవద్దని మీడియాను విజ్ఞప్తి చేశారు. మీడియా, సోషల్ మీడియాలో తనకు, ఇఒ శ్యామలరావుకు మనస్పర్థలు ఉన్నాయంటూ వార్తలు రాయడం సరికాదన్నారు. వైకుంఠ ఏకాదశికి శ్రీవారి యాత్రికులకు మెరుగైన సేవలు అందించామన్నారు. అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలలో మరింత నాణ్యత పాటిస్తున్నామని చెప్పారు. తిరుపతిలో జరిగిన తోపులాట సంఘటన జరగడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, తమను, దేశాన్ని, ప్రపంచాన్ని బాధించిందని తెలిపారు. ఈ సంఘటనలో మతి చెందిన కుటుంబాలకు, తీవ్రంగా గాయపడిన కుటుంబాలకు సిఎం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 31 మందికి పరిహారం అందించామని, మరో 20 మందికి రెండు మూడు రోజుల్లో అందిస్తామని తెలిపారు. ఇఒ జె శ్యామలరావు మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ అంశంపై చాలా సమీక్షలు చేశామన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా జిల్లా మేజిస్ట్రేట్ , జిల్లా ఎస్‌పి పర్యవేక్షణలో ఉంటాయని, వారి సూచనల మేరకు టిటిడి ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతో సమన్వయం చేసుకుని, వారి సూచనల మేరకు టోకెన్లు జారీ ఏర్పాట్లు చేశామన్నారు. తోపులాటలు జరగకుండా చూసే బాధ్యత పూర్తిగా పోలీసుల చేతిలో ఉంటుందన్నారు. యాత్రికుల తోపులాట అంశంపై న్యాయవిచారణ జరుగుతోందని, ఈ విచారణలో పూర్తి విషయాలు వెల్లడవుతాయని తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడిషనల్ ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.



పిట్టగోడను ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు

రెండో ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం

- పలువురు యాత్రికులకు గాయాలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల ఘాట్ రోడ్డులో సోమవారం బస్సు ప్రమాదం జరిగింది. రెండో ఘాట్ రోడ్డులో వెళ్తున్న ఆర్‌టిసి బస్సు పిట్ట గోడను ఢీకొంది. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో కొంతమందికి గాయాలు కాగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి స్విమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదం వల్ల ఘాట్ రోడ్డులో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయి తీవ్రంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది క్రేన్ సాయంతో బస్సును తొలగించే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఆర్‌టిసి అధికారులు విచారణ చేపట్టారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - గుడ్లూరురూరల్

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం, చేవూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నయ్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు అతివేగంగా చేవూరు అడ్డరోడ్డు వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. బైక్‌పై వెళ్తున్న రావూరుకు చెందిన సరస్వతి, వెంకటేశ్వర్లు (54) తీవ్రంగా గాయపడ్డారు. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మరణించారు. కారులో పయనిస్తున్న అధ్విక రాజ్(4)అనే చిన్నారి మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గుడ్లూరు పోలీసులు తెలిపారు.

సంపాదకీయం

పండగ సందడి

సంక్రాంతి తెలుగువారి పెద్ద పండగ. పండగ సందడితో పల్లెలు శోభాయమానంగా రూపుదిద్దుకుంటాయి. సంక్రాంతి అంటే రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, భోగి మంటలు, పిండి వంటలు. సంక్రాంతి పండగ సంప్రదాయ కళలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, గ్రామీణ క్రీడలకు నెలవు. ఇటువంటి సరదాల పండగలో వేల కోట్ల రూపాయలు చేతులు మారే భయంకర జూదం ఏటికేడు కొత్త పుంతలు తొక్కుతూ స్థిరపడుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఈ బాహుబలి గాంబ్లింగ్‌నకు ఏలికలు అండదండగా నిలవడం, పలువురు ప్రత్యక్షంగా పాల్గొనడం, నిర్వహించడం ఎవరు అధికారంలో ఉన్నా ఆనవాయితీ కావడం ఆవేదనకు గురి చేస్తుంది. కోర్టు ఆదేశాలు, చట్టాలు, పోలీస్ నిఘా ఇవేవీ భారీ జూదానికి అడ్డు కాకపోవడం ఆశ్చర్యపరుస్తుంది. సంక్రాంతి అనగానే స్ఫురణకు వచ్చేవి కోడి పందేలు. అక్కడక్కడ ఎడ్ల, పొట్టేళ్ల, గుర్రాల ఇత్యాది పందేలూ నిర్వహిస్తారు. సంప్రదాయాల పేరిట నిర్వహించే ఈ పందేల కేంద్రంగా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలే ప్రధానంగా నిలుస్తున్నాయి. చీట్ల పేక, గుండాట దగ్గర నుంచి అత్యాధునిక కేసినో వరకు జూద క్రీడలదే హవా. రెండు మూడు రోజుల్లో కోట్లు కొల్లగొట్టడానికి వాటంగా ఉన్నందునే వీటిపై నిర్వాహకులకు అధిక మక్కువ.

కోడి పందేలనగానే టక్కున గుర్తుకొచ్చేవి గోదావరి జిల్లాలు. కోడి పందేలకు రాజధానిగా భీమవరం విరాజిల్లుతుండగా ఆ సంప్రదాయాన్ని పుణికిపుచ్చుకుంటున్నాయి రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలు. ఎక్కడో మారుమూలన రహస్యంగా జరిగే పందేలు రానురాను జాతీయ, రాష్ట్ర రహదారుల మీదికొచ్చేశాయి. కొన్ని చోట్ల నగర, పట్టణ నడుబొడ్డున ఎలాంటి భయం లేకుండా పందేలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే బరులు క్రికెట్ స్టేడియాలను తలపింపజేస్తున్నాయి. పెద్ద హీరోల సినిమాల ప్రీ రిలీజ్ ఫంక్షన్లకు ఎంత మాత్రం తీసిపోవడం లేదు. సినిమా సెట్టింగ్‌లను మించిన వైభోగం కోడి పందేల బరుల వద్ద కనిపిస్తోంది. ఎకరాలకు ఎకరాల్లో నిర్వహించే పందేల వీక్షకుల కోసం గ్యాలరీలు, ఎల్ఇడి స్క్రీన్లు, రాత్రిపూట పందేల నిర్వహణ కోసం మిరుమిట్లు గొల్పే ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పందెం రాయుళ్ల సౌకర్యార్థం జిఎస్‌టి, ఇడి, ఐటి వంటి ఇబ్బందుల్లేకుండా స్పాట్ క్యాష్ విధానం, బ్లాక్ మనీ చెలామణి వంటి సదుపాయాలు పుష్కలంగా అమల్లో ఉన్నాయి. వైట్ మనీ చెలామణి కోసం డిజిటల్ పేమెంట్లు సైతం నడుస్తున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆఫ్‌లైన్ ముందస్తు ఒప్పందాలు ఉండనే ఉన్నాయి. పందేల్లో పాల్గొనే వారు ఆస్తుల తనఖా, బంగారు ఆభరణాల తాకట్టు సౌలభ్యం కూడా ఉంది. ఇంత యథేచ్ఛగా జూదం బరితెగించినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు, ఐటికి మారుపేరుగా చెప్పుకునే ప్రభుత్వ దృష్టికి రాకపోవడం విడ్డూరమే!

ఈ మూడు రోజులూ రాష్ట్రంలో నిర్వహించే జూదం విలువెంతో ఊహించలేం. రూ. ఐదారు వేల కోట్లకు పైమాటేనన్నది ఆరి తేరిన కన్సల్టెన్సీల, ఆన్‌లైన్ బెట్టింగ్ ఏజెన్సీల మాట. ఆ అంచనా కూడా తక్కువేనని, అంతకు నాలుగైదు రెట్లని చెప్పేవారూ ఉన్నారు. అన్నేసి వేల కోట్ల జూదం జరిగిందంటే దానర్థం అంత మేరకు వ్యసనపరులు పోగొట్టుకున్నారన్నమాట. సంక్రాంతి జూదంలో ఆస్తులు, డబ్బు పోగొట్టుకొని అప్పుల పాలైన, వీధిన పడ్డ కుటుంబాలనేకం. జూదంతోనే ఆగట్లేదు. మద్యం వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుంది. ఈ ముసుగులో అక్రమ, నాసిరకం మద్యం వచ్చి పడుతోంది. సారాపై నిషేధం ఉన్నా కాపుసారా కోడి పందేల బరులను ముంచెత్తుతోంది. జిల్లాలు, రాష్ట్రాలు దాటి కార్లలో సైతం కోడి పందేల్లో పాల్గొంటున్నారంటే అది సరదా కాదు. జాక్ పాట్ తగులుతుందన్న ఆశ. తక్కువ సమయంలో అధిక మొత్తం చేజిక్కించుకోవాలన్న ఫోబియా. ఈ సంస్కృతి నయా-ఉదారవాదం నుంచి పుట్టుకొచ్చింది. ఈ వాదం తెలుగు పల్లెల్లో వేళ్లూనుకోవడం విషాదం. ఇటువంటి దారుణ పరిస్థితిని వెనక్కికొట్టి అందరికీ సంతోషాన్ని పంచే మన సంప్రదాయ సంస్కృతిని రక్షించుకుంటేనే తెలుగు వారికి నిజమైన సంక్రాంతి! అటువంటి సందడి కావాలి!

మహనీయుని మాట




రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళ అభివృద్ధి సాధించనంత వరకూ సామాజిక భద్రత రాదు. అందునా పురుషాధిక్యత ఉన్న సమాజం గనుక మహిళలు ఉద్యమించాలి.
- వి.ఐ. లెనిన్

ప్రజా ప్రభాతం

జిడిపి-జాతీయత

ప్రభాత్ పట్నాయక్





‘ఉదారవాదులు’ ఎప్పుడూ ‘జాతీయతను వ్యతిరేకిస్తూ ఉంటారు. జాతీయత అనేది ఏకరూప భావన అని, తక్కిన దేశాల పట్ల ఎప్పుడూ శత్రుపూరిత ధోరణితో ఉంటుందని, వారితో సర్దుబాటు చేసుకోడానికి సంసిద్ధత వ్యక్తం చేయదని, వాటితో ఎప్పుడూ తగువులు పడే వైఖరినే అనుసరిస్తుందని ఉదారవాదులు భావిస్తారు. ఐతే ఈ దృక్పథం పూర్తిగా తప్పు. యూరప్ ఖండంలో 17వ శతాబ్దంలో కుదుర్చుకున్న వెస్ట్ ఫాలియన్ శాంతి ఒప్పందాల అనంతర కాలంలో తలెత్తిన జాతీయతావాదం వేరు. మూడవ ప్రపంచ దేశాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తలెత్తిన జాతీయతా వాదం వేరు. యూరోపియన్ జాతీయతా వాదం నుండి నేరుగా పుట్టినది హిట్లర్ వాదం. దానికి పూర్తి విరుద్ధమైనదిగా ఉండే జాతీయతా వాదానికి ఉదాహరణ హోచిమిన్ జాతీయతా వాదం.

17వ శతాబ్దపు యూరోపియన్ జాతీయతా వాదానికి, 20వ శతాబ్దంలో మూడవ ప్రపంచ దేశాలలో తలెత్తిన జాతీయతావాదానికి కనీసం మూడు విషయాల్లో తేడా ఉంది. **మొదటిది:** యూరోపియన్ జాతీయతా వాదం ఆ దేశంలో ఒక అంతర్గత ‘శత్రువు’ మీద ఎక్కుపెడుతుంది. ఉత్తర యూరప్‌లో కేథలిక్కులను, దక్షిణ యూరప్‌లో ప్రొటెస్టెంట్లను, అన్ని దేశాల్లోనూ యూదులను శత్రువులుగా పరిగణించారు. దానికి పూర్తి భిన్నంగా మూడవ ప్రపంచ దేశాలలోని జాతీయతావాదం తమ తమ దేశ ప్రజలందరినీ ఐక్యపరిచే వైఖరితో ఉంటుంది. సామ్రాజ్యవాద శక్తుల బలం చాలా ఎక్కువ. అటువంటి శత్రువును ఎదుర్కోవాలంటే ఈ విధమైన వైఖరి తీసుకోవడం తప్పనిసరి. **రెండవది:** యూరోపియన్ జాతీయతావాదం దేశాన్ని ప్రజలకన్నా గొప్పగా పరిగణిస్తుంది. ఆ దేశం కోసం ప్రజలందరూ త్యాగాలు చేయవలసిందే. అదే మూడవ ప్రపంచపు జాతీయతావాదం ఏళ్ళ తరబడి సామ్రాజ్య వాదుల అణచివేతలో నలిగిపోతున్న ప్రజలందరికీ సేవ చేయడం కోసమే దేశం అన్న వైఖరితో ఉంటుంది. **మూడవది:** యూరోపియన్ జాతీయతావాదం మొదటి నుంచీ సామ్రాజ్యవాద స్వభావంతో ఉంది. వెస్ట్ ఫాలియన్ శాంతి ఒప్పందం జరిగిన కొద్ది మాసాలకే ఆలివర్ క్రాంవెల్ ఐర్లండ్‌ను ఆక్రమించాడు. యూరోపియన్ దేశాలు అన్నీ తర్వాత కాలంలో అనుసరించిన ఇదే వైఖరికి శ్రీకారం చుట్టాడు. జాతీయతా భావాన్ని ప్రేరేపించి ఆ ప్రాతిపదికన తక్కిన దేశాలను ఆక్రమించుకోవడం ఇక్కడ కనిపిస్తుంది. అదే మూడవ ప్రపంచ దేశాల జాతీయతావాదాన్ని చూస్తే అది కూడా ఒకానొక భౌగోళిక పరిధిలోనే వ్యవహరించినప్పటికీ, తక్కిన మూడవ ప్రపంచ దేశాలతో సౌహార్ద్ర సంబంధాలను పెంపొందించు కోడానికి ప్రయత్నించింది. ఆ దేశాలన్నీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని ఎదిరించే పోరాటంలో నిమగ్నమై వుండడమే ఇందుకు కారణం.

ఇక అమూర్తమైన ఆదర్శ భావనగా ‘జాతి’ (లేదా దేశం) అనే దానిని ముందుకు తెచ్చి దానికి దైవత్వాన్ని ఆపాదించి అది ప్రజలకన్నా గొప్పదని చిత్రించడం యూరోపియన్ జాతీయతా వాదపు లక్షణం. దానిని మూడవ ప్రపంచ దేశాల జాతీయతా భావం పూర్తిగా భిన్నం. ఇక్కడ జాతీయత అనేది అమూర్తమైనదేమీ కాదు. అది ప్రజల కోసం రూపొందిన భావం (దీనినే మార్క్స్ గనుక వర్ణించదలచినట్టైతే అది ప్రజల పక్షాన నిలిచే భావం అని చెప్పి వుండేవాడు). జాతీయత ప్రధాన లక్ష్యం ఇక్కడ ప్రజల జీవితాలను మెరుగుపరచడమే.

వలస పాలన నుండి విముక్తి పొందిన దేశాలు వాటి నిర్వహణలో ఎన్ని లోపాలు తలెత్తినప్పటికీ, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం కలిగిన జాతీయతా భావం పట్ల తమ నిబద్ధతను కొనసాగించాయి. ఉదాహరణకు, భారత రాజ్యాంగపు మౌలిక లక్షణాలన్నీ ఆ ప్రాతిపదిక మీదనే రూపొందాయి. రాజ్యాంగ పీఠిక దానికి అద్దం పట్టింది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సోషలిజం వంటివి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగా ఉండి ఆ భావనలన్నీ రాజ్యాంగంలో చోటు చేసుకున్నాయి. అదే విధంగా ప్రైవేటు రంగాన్ని లైసెన్సింగ్ విధానం ద్వారా ప్రభుత్వం అదుపులో ఉంచే ఒక మిశ్రమ ఆర్థిక విధానానికి, సమానత్వం సాధించాలనే లక్ష్యానికి కట్టుబడి పని చేయడం అందులో భాగమే. ఇవేవీ సోషలిస్టు వ్యవస్థ స్థాపన వైపు దేశాన్ని నడిపించేవి కావు. కాని సోషలిజం అనే నినాదాన్ని స్వీకరించడం నుంచి వచ్చినవి. అంటే భారతదేశం ఆనాడు అనుసరించిన “ప్రభుత్వ నియంత్రణతో నడిచే ఆర్థిక వ్యవస్థ” అనేది సోషలిజాన్ని నిర్మిస్తాం అనే ప్రకటిత లక్ష్యం నుండి రూపొందినటువంటిది. ఇది సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావంతో కూడిన జాతీయతతో ముడిపడి వుంది.

అయితే నయా ఉదారవాద వ్యవస్థను ప్రవేశపెట్టడంతో మన దేశంలో మార్పు వచ్చింది. ప్రభుత్వం అంటే జాతీయతాభావం చెప్పినదానికి ఇది భిన్నం. “జాతి” ప్రయోజనాల కోసమే నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టినట్టు చెప్పి సమర్థించుకున్నారు. ఆ విధానాలను అమలు చేసినప్పుడే మన దేశ జిడిపి వేగంగా వృద్ధి చెందుతుందని, దాని ప్రయోజనాలు పైనుంచి కింద ఉండే సామాన్యుల వరకూ క్రమంగా ప్రసరిస్తాయని (ట్రికిల్ డౌన్) అంతేగాక భారత దేశాన్ని ఒక ప్రధాన అగ్ర రాజ్యంగా చేస్తాయని చెప్పారు. నయా ఉదారవాద విధానాలు ఆర్థిక అసమానతలను పెంచుతాయనే వాస్తవాన్ని నయా ఉదారవాద సమర్థకులు ఏనాడూ నిరాకరించలేదు. తమ విధానాలు ఆర్థిక అసమానతలను తగ్గించినట్టు వారు ఎక్కడా చెప్పుకోలేదు. జాతీయోద్యమం ఆశించిన లక్ష్యాలను సాధించడానికి నయా ఉదారవాద విధానాలు మరింత మెరుగ్గా తోడ్పడతాయని వారు చెప్పలేదు. దానికి బదులు ఈ విధానాలు భారత దేశాన్ని ఒక అగ్రరాజ్యంగా మారుస్తాయని వారు చెప్పారు. అంటే ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక దేశంగా, ప్రజల మధ్య సమానత్వం సాధించే దిశగా వ్యవహరించే బదులు, ఆ సామ్రాజ్యవాద దేశాలతో పోటీపడి ఒక అగ్ర రాజ్యంగా తయారవ్వాలనే అవగాహనను ముందుకు తెచ్చారు.

ఈ అవగాహనలో అంతర్లీనంగా “జాతీయత” అంటే ప్రజల పక్షాన నిలిచేది అనే భావన లేకుండా పోయింది. ప్రజల జీవితాలను అన్ని విధాలా మెరుగుపరచడం కోసం పాటుపడేది అన్న లక్ష్యమే లేకుండా పోయింది. దానికి బదులు ఒక అస్పష్టమైన, అమూర్తమైన, ప్రజలకు అతీతమైన జాతీయత అనే భావన చోటు చేసుకుంది. అటువంటి జాతీయత కోసం ప్రజలందరూ త్యాగాలు చేయాల్సిందేనన్న భావన ముందుకొచ్చింది. అంటే “ప్రజలకోసం దేశం” అనే భావన స్థానంలో “దేశం కోసం ప్రజలు” అనే భావన వచ్చింది. యూరప్ ఖండంలో జాతీయత అంటే ఉండిన భావనను ఇది గుర్తు చేస్తోంది. ఐతే ఇది అచ్చంగా యూరోపియన్ భావన వంటిదే అని అనుకోలేం.

ఈ నయా ఉదారవాద వ్యవస్థ అనేది స్వాతంత్ర్యానంతరం నెలకొల్పిన “ప్రభుత్వ నియంత్రణలో నడిచే ఆర్థిక వ్యవస్థ”కు ఉన్న లక్ష్యాలను మరింత మెరుగుగా, వేగంగా సాధించడం కోసం ఏర్పడినది కాదు. ఇది ప్రభుత్వం అనేది ఎవరివైపు ఉండాలి అన్న కీలకమైన విషయాన్నే మార్చివేసింది. ఒక విధంగా చెప్పాలంటే “సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయత” అన్న భావన స్థానంలో “జిడిపి-జాతీయత” అన్నది వచ్చింది. ఆ విధంగా దేశం, జాతీయత వంటి భావనల అర్థమే మారిపోయింది. ఈ “జిడిపి జాతీయత” అనేది యూరోపియన్ జాతీయత మాదిరిగా ఇతర దేశాలమీద పెత్తనం చేయాలనే సామ్రాజ్యవాద స్వభావం కలిగినటువంటిది కాదు. ఇది మన దేశాన్ని తక్కిన దేశాలతో పోటీలో ఉన్నట్టు పరిగణించే జాతీయత. అలాగే ఈ “జిడిపి జాతీయత” అనే భావనలో కొందరు దేశ ప్రజల్ని పరాయివారిగానో, శత్రువులుగానో పరిగణించే కోణం కూడా లేదు. లౌకిక భావనను నిరాకరించే కోణం కూడా లేదు. కాని “జిడిపి జాతీయత” దేశం గురించి జొప్పించిన అమూర్తమైన భావన వలన ఫాసిస్టు జాతీయతా భావాలను జొప్పిండానికి దారి ఏర్పడింది.

ఒక విధంగా చెప్పాలంటే “సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయత” అన్న భావన స్థానంలో “జిడిపి-జాతీయత” అన్నది వచ్చింది. ఆ విధంగా దేశం, జాతీయత వంటి భావనల అర్థమే మారిపోయింది. ఈ “జిడిపి జాతీయత” అనేది యూరోపియన్ జాతీయత మాదిరిగా ఇతర దేశాలమీద పెత్తనం చేయాలనే సామ్రాజ్యవాద స్వభావం కలిగినటువంటిది కాదు. ఇది మన దేశాన్ని తక్కిన దేశాలతో పోటీలో ఉన్నట్టు పరిగణించే జాతీయత. అలాగే ఈ “జిడిపి జాతీయత” అనే భావనలో కొందరు దేశ ప్రజల్ని పరాయివారిగానో, శత్రువులుగానో పరిగణించే కోణం కూడా లేదు. లౌకిక భావనను నిరాకరించే కోణం కూడా లేదు. కాని “జిడిపి జాతీయత” దేశం గురించి జొప్పించిన అమూర్తమైన భావన వలన ఫాసిస్టు జాతీయతా భావాలను జొప్పిండానికి దారి ఏర్పడింది.

సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించుకోవాలనే లక్ష్యం ఉంటే అప్పుడు దానిలో భాగంగా అందరికీ సమానమైన పౌరసత్వ హక్కులను కల్పించాలనే లక్ష్యం కూడా ఉంటుంది. సంపద పంపిణీలో అందరికీ న్యాయం జరగాలనే లక్ష్యం కూడా ఉంటుంది. అదే “జిడిపి జాతీయత” అనే భావనలో చూస్తే సమానత్వం సాధన అన్న లక్ష్యమే లేకుండా పోయింది. దానికి బదులు అస్పష్టమైన “అగ్రరాజ్య స్థాయిని చేరుకోవడం” వంటి లక్ష్యం వచ్చింది. ఈ నయా ఉదారవాద వ్యవస్థ మొత్తంగానే ఇప్పుడు ఒక ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతోంది. అందుచేత సంపద వృద్ధి ప్రయోజనాలు అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజలకు క్రమంగా ప్రవహిస్తాయి అన్న ఆశ కూడా అంతరించింది. సంపదలో పెరుగుతున్న అసమానతలు, పేదరికం అంతకంతకూ ఎక్కువమంది ప్రజానీకాన్ని ఆవరించుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో అగ్ర రాజ్య స్థాయిని సాధించడం వంటి లక్ష్యాలు ఆ ప్రజానీకాన్ని సంతృప్తి పరచలేవు. ఈ దశలోనే దేశంలోని బడా పెట్టుబడి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకం అయి నయా ఉదారవాద వ్యవస్థను నిలబెట్టడానికి ఫాసిస్టు శక్తులతో కూడబలుక్కుని వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే “హిందూ రాజ్యం” అన్న భావన ముందుకొచ్చింది. ఇది రాజ్యం యొక్క ఫాసిస్టు స్వభావాన్ని కప్పిపుచ్చడం కోసం రూపొందించిన నినాదం మాత్రమే.

ఈ హిందూ రాజ్యం అనే అస్పష్ట భావన ఇంతవరకూ ఉన్న “జిడిపి జాతీయత”కు ప్రత్యామ్నాయంగా వచ్చినది కాదు. దానికి తోడుగా అదనంగా వచ్చి చేరినటువంటిది. ఇప్పుడు హిందూ రాజ్యం అనే ఫాసిస్టు జాతీయతావాదం నయా ఉదారవాద వ్యవస్థను బలపరిచే సైద్ధాంతిక ముసుగుగా పని చేస్తోంది.

ఫాసిస్టు శక్తుల ఆధిపత్యాన్ని అధిగమించాలంటే కేవలం నయా ఉదారవాద వ్యవస్థను అధిగమిస్తే చాలదు. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయతా భావాలను కూడా పునరుద్ధరించాల్సి వుంటుంది. లేకపోతే ఈ ఫాసిస్టు శక్తులు అధికారం కోల్పోయినా, మళ్ళీ తిరిగి అధికారం లోకి వచ్చే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అదే మాదిరిగా మళ్ళీ వచ్చాడు.

మన దేశంలో మొదట నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టిన రాజకీయ శక్తులు లౌకిక విధానానికి వ్యతిరేకం కాదు. భారత దేశాన్ని ఒక అగ్ర రాజ్యంగా నిలబెట్టడానికి జిడిపి వృద్ధి రేటును వేగవంతం చేయడమే మార్గం అనే వాదనతో ఆ శక్తులు కొత్త వ్యవస్థను (నయా ఉదారవాద వ్యవస్థను) బలపరిచాయి (అవినీతి అనేది భారత దేశాన్ని ఒక అగ్రరాజ్యంగా నిలబెట్టడానికి ఆటంకంగా తయారౌతోంది కనుక దానిని తొలగించాలని ఒక కాంగ్రెస్ నాయకుడు ఒక సందర్భంలో అన్నాడు. అలా ఆటంకంగా ఉండనట్టైతే అతడికి అవినీతి పట్ల వ్యతిరేకత ఉండేది కాదన్నమాట). ఇప్పుడు ఆ విధానాల అమలుకు ముందు దారి మూసుకుపోయింది. ఇక్కడ ప్రజలందరి ప్రయోజనాలనూ నెరవేర్చగల, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం గల జాతీయత అనేదానికి చోటే లేదు. ఇప్పుడు ఈ పరిస్థితి బడా పెట్టుబడిదారీ వర్గాన్ని ఫాసిస్టు శక్తులతో జత కట్టడానికి మాత్రమే కాక ఆ ఫాసిస్టు శక్తులు తమ ఫాసిస్టు “జాతీయత”తో అధికారాన్ని సైతం చేపట్టే స్థాయికి సైతం దోహదం చేసింది.

ఆ విధంగా నయా ఉదారవాద వ్యవస్థను ప్రవేశ పెట్టడానికి సైద్ధాంతిక ప్రాతిపదికగా పని చేసిన “జిడిపి జాతీయత” సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయతను దెబ్బ తీసి ఫాసిస్టు “జాతీయత” పైచేయి సాధించడానికి కావలసిన రంగాన్ని సిద్ధం చేసింది.

అందుచేత ఫాసిస్టు శక్తుల ఆధిపత్యాన్ని అధిగమించాలంటే కేవలం నయా ఉదారవాద వ్యవస్థను అధిగమిస్తే చాలదు. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయతా భావాలను కూడా పునరుద్ధరించాల్సి వుంటుంది. లేకపోతే ఈ ఫాసిస్టు శక్తులు అధికారం కోల్పోయినా, మళ్ళీ తిరిగి అధికారం లోకి వచ్చే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అదే మాదిరిగా మళ్ళీ వచ్చాడు.

ఈ విషయాన్ని ఇప్పుడు నొక్కి చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్‌ను చాలా మంచి మనసు, హృదయం ఉన్న వ్యక్తిగా, అసలు సిసలైన లౌకికవాదిగా స్మరించుకుంటున్నారు. కాని ఈ దేశంలో నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టడంలో ముఖ్య భూమిక పోషించినది అతడే. డా.మన్మోహన్ సింగ్ వ్యక్తిగత విశిష్ట స్వభావాన్ని అడ్డం పెట్టుకుని నయా ఉదారవాద వ్యవస్థను సమర్థించడానికి పలువురు ఇప్పుడు తయారయ్యారు. ఫాసిస్టు శక్తులు బలపడడానికి, నయా ఉదారవాద విధానాలకు గల సంబంధాన్ని చాలా మంది అర్థం చేసుకోవడం లేదు కనుక వీరి ప్రయత్నం కొంతవరకూ విజయం సాధించవచ్చు కూడా. ఫాసిస్టు శక్తులు బలపడడానికి కేవలం రాజకీయ కారణాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ దాని వెనుక ఉన్న ఆర్థిక కారణాలను విస్మరిస్తే ఇదే జరుగుతుంది. ఈ పొరపాటు అవగాహనను సరి చేసుకోకపోతే అది అంతిమంగా ఫాసిస్టు శక్తులు మరింత బలపడడానికే తోడ్పడుతుంది.

(స్వేచ్ఛానుసరణ)

(యూరప్‌లో 30 సంవత్సరాలపాటు కొనసాగిన యుద్ధాల అనంతరం 1648లో వెస్ట్‌ఫాలియా లోని ఒస్నాబ్రక్, మన్‌స్టర్ అనే ప్రాంతాల్లో శాంతి ఒప్పందాలు కుదిరాయి. పవిత్ర రోమన్ సామ్రాజ్యం స్వీడెన్‌తో ఒకటి, ఫ్రాన్స్‌తో మరొకటి ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాలు ఆ యా దేశాలలో అనుసరించే మతాల విషయంలో, ప్రాదేశిక స్వతంత్రత విషయంలో జోక్యం కల్పించుకో కూడదన్న అంగీకారానికి వచ్చాయి. ఆధునిక యూరప్ రాజ్యాలు ఏర్పడడానికి ఈ ఒప్పందాలు తొలి అడుగుగా పరిగణిస్తారు.)

★

వ్యాఖ్య

దేవదూతా? మానవుడా!

ఎం. కోటేశ్వరరావు




ఇంతకీ నరేంద్ర మోడీ ఎవరు? లోక్‌సభ ఎన్నికలకు ముందు చెప్పినట్లు మహత్తర లక్ష్యం కోసం దేవుడు పంపిన దూత అనుకోవాలా? తాజాగా చెప్పినట్లు మానవుడినే కానీ దేవుడిని కాదు, తప్పులు చేసి ఉంటా అనే మాటలు నమ్మాలా? మోడీ గురించి తెలిసిన వారు ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగు ధన్యుడు అనుకుంటారు. ఇక తేల్చుకోవాల్సింది భక్తులే! అప్పుడు దేవుడు ఎందుకు పంపాడని చెప్పారో ఇప్పుడు మానవుడినే అని ఎందుకు అన్నారో మోడీ ఎలాగూ నోరు విప్పరు గనుక ఆయన ప్రథమ గణాలు వివరించాలి. ఈ కాలంలో మోడీ నెరవేర్చిన లేదా మిగిలిపోయిన మహత్తర లక్ష్యం ఏమిటో ఎవరికైనా తెలుసా? ‘జరోధా’ అనే సంస్థ తరపున నిఖిల్ కామత్ 2025 జనవరిలో మోడీతో నిర్వహించిన పాడ్‌కాస్ట్ (ఒక జర్నలిస్టు జరిపే ముఖాముఖి-ప్రశ్నలు ముందే ఇవ్వాలి, ఇంటర్వ్యూ సమయంలో మోడీని ఇబ్బందికరమైన కొత్త ప్రశ్నలు అడగకూడదు అనే షరతులు వర్తిస్తాయి)లో అనేక అంశాలను వివరించారు. తనకు దేశమే ప్రథమ లక్ష్యం అన్నారు. గుజరాత్ సి.ఎం గా పని చేస్తున్నపుడే మరో ఇరవై సంవత్సరాల పాటు పని చేసే బృందాన్ని తాను తయారు చేశానని, ఇప్పుడు కూడా చేస్తున్నట్లు చెప్పారు. అయితే ఆ బృందంలో ఎవరున్నారో వెల్లడించలేదు, వ్యక్తుల పేర్లు చెబితే అనేక మంది ఇతరులకు అన్యాయం చేసినట్లు అవుతుందని చెప్పుకున్నారు. దీన్ని బట్టి ఆ బృందం ఒక బ్రహ్మ పదార్ధం అనాల్సి ఉంటుంది. ప్రతివారినీ తన ఖాతాలో వేసుకోవచ్చు. మరికొన్ని సుభాషితాలు, స్వంత గొప్పలు ఇలా ఉన్నాయి. తప్పులు సహజం కానీ దురుద్దేశాలతో చేయలేదు, నేనూ తప్పులు చేసి ఉంటాను, నేను మనిషిని దేవుడిని కాదు....పాడ్‌కాస్ట్ ఇలా సాగింది. మహాత్మా గాంధీ, సావర్కర్ మార్గాలు వేరైనా ఇద్దరూ స్వాతంత్ర్యం కోసమే పోరాడారంటూ ఇద్దరూ ఒకటే అన్నట్లుగా చిత్రించారు. జైలు నుంచి విడుదల చేస్తే బ్రిటీష్ వారికి సేవ చేసుకుంటానని, స్వాతంత్ర్య ఉద్యమానికి దూరంగా ఉంటానంటూ ప్రేమ లేఖలు రాసిన సావర్కర్‌ను గాంధీతో పోల్చటం చరిత్ర వక్రీకరణ తప్ప మరొకటి కాదు.

ఎనిమిది నెలల క్రితం తన జన్మ జీవ సంబంధమైనది కాదని (2024 లోక్‌సభ ఎన్నికల చివరి దశలో) నరేంద్ర మోడీ చెప్పుకున్నారు. ఇప్పుడు మానవుడిని అని చెప్పుకోవటం నష్ట నివారణ చర్య అని స్పష్టంగా కనిపిస్తోందని కాంగ్రెస్ నేత జయరామ్ రమేష్ వ్యాఖ్యానించారు. భూమ్మీద తన ఉనికి కేవలం జీవ సంబంధమైనది కాదని, తనను దేవుడు భూలోకంలోకి ఒక లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పంపాడని తనకున్న శక్తులను చూసిన తరువాత ఈ మాటలు చెప్పగలుగుతున్నట్లు తన తల్లి మరణించిన తరువాత మోడీ చెప్పిన సంగతి తెలిసిందే. “నా తల్లి బతికి ఉన్నంత వరకు నేను కూడా జీవసంబంధంగానే జన్మించానని అనుకున్నాను. కానీ తరువాత అనుభవాలను చూస్తే పరమాత్ముడు ఒక లక్ష్యం కోసం పంపాడని నేను నమ్మాను. ఆ లక్ష్యం నెరవేరిన తరువాత మరోసారి నాతో పని ఉండదు. అందువల్లనే నేను పూర్తిగా దేవుడి కోసం అంకితమయ్యాను. నేను ఒక సాధనాన్ని తప్ప మరొకటి కాదు” అంటూ అదానీ యాజమాన్యంలోని ఎన్‌డిటివితో మోడీ చెప్పారు (ఆ లక్ష్యం ఏమిటో, ఎంత వరకు వచ్చింది, పూర్తి చేసిందీ లేనిదీ చెప్పలేదు). ఒక సామాన్యుడు ఇలాంటి మాటలు మాట్లాడితే అలాంటి వారిని నేరుగా మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకెళతారంటూ అప్పుడు రాహుల్ గాంధీ అపహాస్యం చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా మోడీ మారు మాట్లాడలేదు. అంతకు కొద్ది రోజుల ముందు తననెవరూ దెబ్బతీయలేరని, తాను మూడు, ఐదు చివరికి ఏడు ఎన్నికలైనా సరే గెలుస్తూనే ఉంటానని చెప్పుకున్నారు. తనకు ఓటు వేయటం అంటే పుణ్యం చేసుకోవటమేనని కూడా చెప్పారు. మోడీ చుట్టూ ఉన్నవారు కూడా ఆయనను ఆకాశానికి ఎత్తిన తీరు చూశాము. ఎంతగా అంటే పూరీ జగన్నాథుడు కూడా నరేంద్ర మోడీ భక్తుడేనని ఒడిషాకు చెందిన బిజెపి నేత సంబిత్ పాత్ర వర్ణించి తరువాత నోరు జారినట్లు చెప్పుకున్న సంగతి తెలిసిందే.

దైవదూతను అన్న నోటితోనే అదానీ, అంబానీలు రాహుల్ గాంధీకి టెంపోల నిండుగా నోట్ల కట్టలు పంపారని తుచ్ఛ మానవుల మాదిరి మోడీ ఎన్నికల సమయంలో ఆరోపణ చేసిన సంగతిని గుర్తుకు తెచ్చుకోవాలి. అంటే ఆ పారిశ్రామిక, వాణిజ్యవేత్తల దగ్గర లెక్కల్లో చూపని నల్లధనం పెద్ద ఎత్తున ఉందని చెప్పటమే. బహుశా ఆ వ్యాఖ్యల తరువాత తన స్నేహితుల గురించి మాట్లాడింది తప్పని తెలిసిందో లేక వారి నుంచి హెచ్చరికలు వచ్చాయో తెలియదు గానీ తరువాత మరోసారి ప్రస్తావించలేదు. తనకు ఇల్లూ, సంసార బంధాలు లేవు, దేశం కోసమే పుట్టినట్లు నరేంద్ర మోడీ చెప్పుకుంటారు. భక్తులు కూడా అదే చెబుతారు. గుజరాత్ రాజధాని గాంధీ నగర్‌లో ధనికులు నివసించే ప్రాంతంలో తనకు ఒక ఇంటి స్థలం ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్న అంశాన్ని ‘కారవాన్’ పత్రిక వెల్లడించింది. ముఖ్యమంత్రిగా ఉండగా తన పేరున తానే మంజూరు చేసుకున్న స్థలమది. దాని మీద వివాదం చెలరేగటం, కోర్టులకు ఎక్కటంతో సదరు స్థలాన్ని పార్టీకి ఇస్తానని మోడీ చెప్పారు. ఏ బంధాలు లేని తాను స్థలం తీసుకోవటం ఎందుకు, తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేయకుండా పార్టీకి ఇస్తానని చెప్పటం ఏమిటి? ఈ స్థలం ఉన్న అంశం గురించి మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం జరిగిందనే ఆరోపణ ఉంది.

నరేంద్ర మోడీ గురించి ఉన్నతంగా చిత్రించేందుకు ప్రశాంత కిషోర్ వంటి నిపుణులెందరో పని చేశారన్నది బహిరంగ రహస్యం. దానికి గోడీ మీడియా ఎంతగానో సహకరించిందని అనేక మంది విమర్శలు చేసింది కూడా వాస్తవమే. 2019లో ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ పేరుతో ఒక ప్రచార సినిమా కూడా తీశారు. వాస్తవాల ఆధారంగా తీసినట్లు చెప్పిన ఆ సినిమాలో వక్రీకరణలు, అవాస్తవాలెన్నో, అన్నింటినీ త్యజించి దేశం కోసమే మోడీ పాటుపడుతున్నట్లు చిత్రించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేసిన నరేంద్ర మోడీ బాల్యంలో ఒక చేత్తో టీ అమ్ముతూ మరో చేత్తో జాతీయ జండాను పట్టుకున్నట్లు, దానికి వందనం చేసినట్లు చూపారు. వాస్తవం ఏమంటే అదే ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 52 సంవత్సరాల పాటు జాతీయ జండాను ఎగురవేయటానికి నిరాకరించింది. బాల్యంలోనే జాతీయ భావాలతో పెరిగినట్లు సినిమాలో చూపిన మోడీ కూడా ఆర్‌ఎస్‌ఎస్‌లో భాగస్వామే. శ్రీనగర్ లాల్‌చౌక్‌లో ఆర్మీ పహారాలో బిజెపి నేత మురళీ మనోహర్ జోషి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కానీ ఈ చిత్రంలో నరేంద్ర మోడీ ఆ పని చేశారని చూపించటం కళ్ల ముందే చరిత్రను వక్రీకరించటం తప్ప మరొకటి కాదు. దేశ చరిత్రలో ఏ ప్రధానీ చేయని విధంగా గుళ్ల గోపురాలు తిరిగి, ధ్యానం పేరుతో ఫొటో ప్రదర్శనలు, అయోధ్యలో రామాలయ ప్రారంభం సందర్భంగా అన్నీ తానై చేసిన హడావుడి, బాలరాముడి చిత్రంతో నరేంద్ర మోడీ బొమ్మ పెట్టి వేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, వాటన్నింటికీ పరాకాష్టగా అసలు తనది జీవ సంబంధ జన్మ కాదని చెప్పుకొనేంత వరకు వెళ్లింది. ఇప్పుడు తాను మానవుడనే అని, తప్పులు చేయటం సహజం అని చెప్పుకోవటం కూడా తన గురించి తాను గొప్పగా చెప్పుకోవటంలో భాగమే అన్నది స్పష్టం. మాట మార్చి తాను మానవ మాత్రుడనని ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చింది? అయోధ్యలో బిజెపి ఓడిపోవటం, వారణాసిలో తన మెజారిటీ భారీగా పడిపోవటం, లోక్‌సభలో ఒక పార్టీగా బిజెపికి సంపూర్ణ మెజారిటీని తీసుకు రావటంలో వైఫల్యం, గతం కంటే ఓట్లు కూడా తగ్గటం, దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారడం...ఎటు చూసినా వైఫల్యాలే కనిపిస్తుండగా తాను దైవాంశ సంభూతుడనని, తన శక్తి గురించి చెప్పుకొనే అవకాశాలు ఆవిరయ్యాయి. వీటి గురించి ఎవరు ఎక్కడ ప్రశ్నిస్తారోనని గ్రహించి తాను కూడా మానవ మాత్రుడనేనని, వైఫల్యాలు సహజమేనని చెప్పుకొనేందుకు చూసినట్లు కనిపిస్తోంది.

★



అయోధ్యలో బిజెపి ఓడిపోవటం, వారణాసిలో తన మెజారిటీ భారీగా పడిపోవటం, లోక్‌సభలో ఒక పార్టీగా బిజెపికి సంపూర్ణ మెజారిటీని తీసుకు రావటంలో వైఫల్యం, గతం కంటే ఓట్లు కూడా తగ్గటం, దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారడం...ఎటు చూసినా వైఫల్యాలే కనిపిస్తుండగా తాను దైవాంశ సంభూతుడనని, తన శక్తి గురించి చెప్పుకొనే అవకాశాలు ఆవిరయ్యాయి. వీటి గురించి ఎవరు ఎక్కడ ప్రశ్నిస్తారోనని గ్రహించి తాను కూడా మానవ మాత్రుడనేనని, వైఫల్యాలు సహజమేనని చెప్పుకొనేందుకు చూసినట్లు కనిపిస్తోంది.

సంక్షోభంలో మిర్చి రైతు

- భారీగా ధరలు పతనం
- ఎకరాకు గరిష్టంగా రూ.లక్షన్నర వరకు నష్టం



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మిర్చి రైతులు సంక్షోభంలో చిక్కుకుంటున్నారు. గత ఏడాది కాలంగా ధరల తగ్గుదలతో మిర్చి సాగు గిట్టుబాటు కాక రైతులు అల్లాడుతున్నారు. పెట్టుబడి పెరగడం, ఆదాయం తగ్గడంతో ఎకరా ఒక్కింటికే లక్షన్నర రూపాయల వరకూ రైతులు నష్టపోతున్నారు. 2019-20, 2020-21లో సగటు ధర రూ.12 వేలు లభించింది. 2021-22లో రూ.13 వేలు, 2022-23లో రూ.20,500., 2023-24లో రూ.20 వేలు వచ్చాయి. 2024-25లో ఈ ధర రూ.13 వేలకు పతనమైంది. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు గరిష్ట సగటు ధర రూ.13 వేలు దాటలేదు. కరోనా సమయంలో కొంత ఇబ్బంది ఎదురైనా ఆ తర్వాత రెండేళ్ల పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే, 2024, 2025లో ధరల పతనం కొనసాగుతోంది. 2022, 2023 సంవత్సరాల్లో మార్కెట్‌లో ధరలు బాగా ఉండడంతో ఇదే తరహాలో ధరలు పెరుగుతాయని ఆశించి రైతులు మిర్చి సాగుపై ఆసక్తి కనబర్చారు. అనూహ్యంగా గతేడాది జనవరి నుంచి ధరలు తగ్గుతూ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు కదలడం లేదు. 2023లో పోలిస్తే మేలైన రకాలకు క్వింటాలుకు రూ.10 నుంచి 15 వేలు వరకు ధర తగ్గింది. మేలు రకాలు బాడిగ, దేవనూరు డీలక్సు, తేజ వెరైటీలకు 2022, 2023 సంవత్సరాల్లో గరిష్టంగా రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు ధర పలికింది. గత ఏడాది, ఈ ఏడాది సగటున రూ.10 వేల నుంచి రూ.15 వేలు తగ్గింది. ఎకరాకు సగటున పది క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుందని అంచనా. ధర తగ్గడంతో ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు రైతులకు నష్టం వస్తోంది. గతేడాది ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ ఏడాదీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుతం గుంటూరు పరిసర ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీల్లో 18 లక్షల టిక్కీల మిర్చి నిల్వ ఉంది. ప్రస్తుతం రాయలసీమతో, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి రోజుకు 40 వేల నుంచి 60 వేల టిక్కీలు వస్తున్నాయి. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న సరుకు అమ్ముడుపోక, కొత్త సరుకుకు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఎకరాకు రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు రెండేళ్ల క్రితం కనీసం లక్షన్నర వరకు లాభాలు వచ్చేవి. 2014లో ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. 2015లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎగుమతి ఆర్డర్లు తగ్గాయని, ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేదని చెబుతూ గత కొంతకాలంగా మిర్చి ధరలను వ్యాపారులు తగ్గిస్తున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది ధరలు మరింత తగ్గాయి. గరిష్ట ధర మేలు రకాలకు రూ.15 వేలు, సాధారణ రకాలకు రూ.13,500 మాత్రమే వస్తోంది. పేరెన్నిక స్పెషల్ వెరైటీలు తేజ, బాడిగ ధరలు కూడా భారీగా తగ్గాయి. తేజ కనిష్ట ధర రూ.7,500, గరిష్ట ధర రూ.15,500 మాత్రమే లభిస్తోంది. బాడిగ కనిష్ట ధర రూ.7,500, గరిష్ట ధర రూ.13,500 వస్తోంది. దేవనూరు డీలక్స్ కనిష్టం రూ.8,500, గరిష్టం రూ.15 వేలు మాత్రమే లభిస్తోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న సరుకు ధరలు ఇంకా తగ్గుతున్నాయి. ధరల పతనంపై ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి సమీక్షా చేయలేదు. గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

అట్టహాసంగా కుంభమేళా



ప్రయాగ్‌రాజ్ : పన్నెండేళ్ళకు ఒకసారి జరిగే మహా కుంభమేళా ఆదివారం ఉత్తర ప్రదేశ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల సంగమమైన ప్రయాగ్‌రాజ్ వద్ద అట్టహాసంగా ప్రారంభమైంది. పుష్కర స్నానాల కోసం జనం పెద్దయెత్తున పోటెత్తారు. పుష్య పౌర్ణమి అయిన సోమవారం తెల్లవారుజామునుంచే లక్షలాది మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు చేరుకున్నారు. తొలి రోజు దాదాపు 60 లక్షల మంది మహా కుంభమేళాకు తరలి వచ్చారని అంచనా వేసినట్లు ప్రయాగ్‌రాజ్ అధికారులు తెలిపారు. శివరాత్రి వరకు అంటే ఫిబ్రవరి 26 దాకా కుంభమేళా కొనసాగుతుంది. ఇందుకోసం భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీసుస్టేషన్‌ను ఏర్పాటుచేశామన్నారు. భద్రత కోసం 55 పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని, 45,000 మంది పోలీసులను మోహరించామని యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మహాకుంభమేళా ప్రారంభంపై ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజు." అని వ్యాఖ్యానించారు.

15 లక్షలమంది విదేశీ పర్యాటకులు, 10 ఎకరాల్లో కళాగ్రామ్

అలాగే, ఈ మహా కుంభమేళాకు 15 లక్షల మంది పైగా విదేశీ పర్యాటకులు హాజరవుతారని, వారి కోసం పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రత్యేక టెంట్ సిటీని సిద్ధం చేసిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మీడియాకు తెలిపారు. ఈ టెంట్ సిటీలో ఆయుర్వేదం, యోగా, పంచకర్మ వంటి వైద్య సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లోని నాగవాసుకి ప్రాంతంలోని సెక్టార్ 7లో 10 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భారతీయ సాంస్కృతిక వారసత్వ కేంద్రం 'కళాగ్రామ్'ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వివరాలను తెలిపారు. కళాగ్రామ్‌లో 14,630కు పైగా కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారని, మహా కుంభమేళాకు వచ్చే యాత్రికులు అయోధ్య, కాశీ, మధుర తదితర ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా విమాన ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

జమ్ము కాశ్మీర్‌లో టన్నెల్
ప్రారంభించిన ప్రధాని మోడీ

- రాష్ట్ర హోదా పునరుద్ధరణపై దాటవేత



జెడ్- మోడ్ టన్నెల్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

సోనామార్గ్ : కాశ్మీర్‌లోని గందెర్బాల్ జిల్లాలో నిర్మించిన జెడ్- మోడ్ టన్నెల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జమ్ముకాశ్మీర్‌లో నూతన రహదారులు, రైల్వే లైన్ల గురించి వివరాలు తెలిపారు. అయితే, జమ్ముకాశ్మీర్ రాష్ట్ర హోదా మళ్లీ ఎప్పుడు పునరుద్ధరించేదీ చెప్పలేదు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన ప్రసంగంలో రాష్ట్ర హోదా డిమాండ్ గురించి ప్రస్తావించారు. దీనికి ఆయన సమాధానం ఇస్తూ, 'మోడీ వాగ్దానం చేస్తే దాన్ని నెరవేరుస్తాడు. ప్రతి దానికి సరైన సమయం ఉంటుంది. సరైన సమయంలో సరైన పనులు జరుగుతాయి' అని తెలిపారు. అలాగే ఈ టన్నెల్ గురించి మోడీ మాట్లాడుతూ, 2015లో శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు దీనిని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ టన్నెల్‌తో సోనామార్గ్‌లో పర్యాటకరంగం కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. కాశ్మీర్‌ను లడఖ్‌తో కలిపే శ్రీనగర్ - లేహ్ జాతీయ రహదారిపై సోనామార్గ్‌కు సమీపంలో గగంగిర్ గ్రామం వద్ద నిర్మించారు. 6.5 కిలోమీటర్ల పొడవైన ఈ టన్నెల్‌ను రూ.2,700 కోట్లతో నిర్మించారు. వాస్తవానికి దీనిని 2023 ఆగస్టులోనే ప్రారంభించాల్సి ఉంది. కాని అనేక సమస్యలతో నిర్మాణం ఆలస్యమయింది. ఈ ప్రారంభం సందర్భంగా మోడీ మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ అనేది భారత దేశానికి కిరీటమని, కాబట్టి ఇది అందంగా, బలంగా ఉండాలని చెప్పారు. ఇక్కడ చీనాబ్ వంతెన నిర్మాణం ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆశ్చర్యపరిచిందని, ఈ వంతెనపై ఇటీవలే ప్యాసింజర్ రైలు ట్రయల్స్ పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లాతో పాటు, జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ప్రసంగించారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే ప్రమాదం : ఎస్‌ఎఫ్‌ఐ


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తుందని, ఐదు రకాల పాఠశాల వ్యవస్థతో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే ప్రమాదం ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్న కుమార్, ఎ.అశోక్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ విధానంపై ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జిఒ 117తో ప్రాథమిక పాఠశాలలను రెండు ముక్కలు చేసిందన్నారు. దీంతో 12,247 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని తెలిపారు. ఈ జిఒను రద్దు చేయడం శుభ పరిణామమేనని, అయితే, దీని స్థానంలో తీసుకువచ్చిన నూతన ఉత్తర్వులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన మెమోలో విద్యార్థులు ప్రకాశవంతమైన భవిష్యత్‌తో గ్లోబల్ పౌరులు కావాలని లక్ష్య నిర్దేశం చేశారని, నేటికి ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులకు చదవడం, రాయడం రావడం లేదని, ఈ పరిస్థితుల్లో అంత గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఈ వ్యవస్థలో ప్రాథమిక పాఠశాలలు, బేసిక్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలుగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారని, ఆదర్శ పాఠశాలలు ఆదర్శవంతంగా తయారవుతాయో లేదో కాని, బేసిక్ పాఠశాలలు మాత్రం కునారిల్లిపోతున్నాయని స్పష్టం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో భవిష్యత్తులో 20 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారనున్నాయని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో 30 మంది కంటే తక్కువ ఉన్న విద్యార్థులను సమీప హైస్కూళ్లలో చేర్చి, వీటిని రద్దు చేస్తారన్నారు. ఫలితంగా విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడనుందని తెలిపారు. ఈ మెమోలో మాతృ భాష మాధ్యమం ప్రస్తావన లేదన్నారు. రెండు మాధ్యమాలు సమాంతరంగా ఉండాలనే ఆలోచనను మరిచారని పేర్కొన్నారు. విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి సెక్షన్ల ఆధారంగా కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉండాలని కోరారు. ప్రపంచ బ్యాంక్ షరతుల్లో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన సాల్ట్ విధానాలను కొనసాగిస్తారా? లేదా? అనే అంశంపై స్పష్టమైన విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అతిషి క్రౌడ్ ఫండింగ్

- 24 గంటల్లో రూ.17 లక్షలు
- నేడు నామినేషన్ దాఖలు



న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసేందుకు తగిన డబ్బు లేదంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ప్రారంభించిన ఆన్‌లైన్ 'క్రౌడ్ ఫండింగ్' డ్రైవ్‌కు మంచి స్పందన వచ్చింది. 24 గంటల్లో 335 మంది దాతలు రూ.17 లక్షలకు పైగా విరాళం ఇచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా కల్కాజీ నియోజకవర్గం నుంచి అతిషి పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారానికి రూ.40 లక్షలు అవుతుందని అతిషి అంచనా వేశారు. అంత డబ్బు తనవద్ద లేదంటూ విరాళాలు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఇందుకోసం ఆన్‌లైన్ లింక్‌ను ఆదివారం విడుదల చేశారు. కాగా, తాను చేసిన విజ్ఞప్తికి తొలి రోజే అనూహ్య స్పందన రావడం ఆశ్చర్యానికి గురిచేసిందని 'ఎక్స్'లో అతిషి పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నిష్కళంక, నిజాయతీ, ట్రాన్స్‌ఫర్మేటివ్ పాలిటిక్స్‌పై ప్రజలు చెక్కుచెదరని నమ్మకం ప్రదర్శించారనడానికి ఇదే నిదర్శనమని అన్నారు.

తమిళనాడు సిపిఎం రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన శ్రీలంక మంత్రులు



చెన్నై : శ్రీలంకకు చెందిన ఇద్దరు మంత్రులు ఆదివారం చెన్నైలోని తమిళనాడు సిపిఎం రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. శ్రీలంక మత్స్య, జల, సముద్ర వనరుల శాఖ మంత్రి, జనతా విముక్తి పెరుమున (జెవిపి, శ్రీలంకలో వామపక్ష పార్టీ) కేంద్ర కమిటీ సభ్యుడు రామలింగం చంద్రశేఖర్, శ్రీలంక ప్లాంటేషన్, కమ్యూనిటీ మౌలిక సదుపాయాల శాఖ సహాయ మంత్రి సుందరలింగం ప్రదీప్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. వీరికి ఇటీవలే రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పి. షణ్ముగం శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. బాలకృష్ణన్, యు.వాసుకి స్వాగతం పలికారు. శ్రీలంక మంత్రులను శాలువాలతో సత్కరించారు. అలాగే ఈ నాయకులు సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న శ్రీలంక తమిళల సమస్యలు గురించి, తమిళనాడు జాలర్లపై శ్రీలంక నౌకాదళం చేస్తున్న దాడుల గురించి చర్చించారు.

ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో మోడీ, కేజ్రీవాల్ విఫలం

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో ప్రధాని మోడీ, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ విఫలమయ్యారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరిందని, పేదవాళ్లు మరింత పేదలుగా మారుతుంటే, సంపన్నులు మరింత సంపన్నులవుతున్నారని అన్నారు. "ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, అరవింద్ కేజ్రీవాల్ ఒక్కసారైనా అదానీ గురించి మాట్లాడటం మీరు చూశారా? బిలియనీర్ల దేశం మాకవసరం లేదు" అని రాహుల్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నుంచి రాహుల్ గాంధీ ప్రచారం ప్రారంభించారు. సీలాంపూర్ ప్రాంతంలో జరిగిన 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' ర్యాలీలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ధ్వంసం చేస్తున్నాయని విమర్శించారు. ఢిల్లీని పారిస్‌గా మారుస్తామని, అవినీతిని నిర్మూలిస్తామని కేజ్రీవాల్ ప్రచారం చేశారనీ, కానీ కాలుష్యం పెరిగిందని, ద్రవ్యోల్బణం తారాస్థాయిలో ఉందని రాహుల్ అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్, కులగణనను కేజ్రీవాల్ కోరుకుంటున్నారా? అని ప్రజలు ఆయనను ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే గతంలో ఢిల్లీని ఏవిధంగా అభివృద్ధి చేశామో ఆ విధంగా చేసి చూపిస్తామని, ఆ పని కేజ్రీవాల్ కానీ, బిజెపి కానీ చేయలేదని రాహుల్ స్పష్టం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 5న జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

చెమటోడ్చి నెగ్గిన భారత్

ఖో-ఖో ప్రపంచకప్ ప్రారంభ మ్యాచ్‌లో నేపాల్‌పై 42-37పాయింట్లతో గెలుపు



న్యూఢిల్లీ: ఖో-ఖో ప్రపంచకప్‌లో ఆతిథ్య భారతజట్టు బోణీ కొట్టింది. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్‌లో భారత్ 42-37 పాయింట్ల తేడాతో నేపాల్‌పై చెమటోడ్చి నెగ్గింది. తొలుత భారత్ వరుసగా పాయింట్లను సాధించగా.. నేపాల్ జట్టు ఆ తర్వాత ధీటుగా భారత్‌ను ఎదుర్కొంది. చివరకు భారత్‌కు గట్టి పోటీనిచ్చిన నేపాల్.. ఆతిథ్య జట్టు చేతిలో కేవలం 5పాయింట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో తొలి మ్యాచ్‌లో నెగ్గిన భారత్‌కు 2 పాయింట్లు దక్కాయి. మంగళవారం నుంచి భారత మహిళల పోటీలు ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్‌లో భారతజట్టు కొరియాతో తలపడనుంది. పురుషుల జట్టుకు ప్రతీక్, మహిళలజట్టుకు ప్రియాం ఇంగ్లే కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు. పురుషుల విభాగంలో 20, మహిళల విభాగంలో 19జట్లు ఖో-ఖో ప్రపంచకప్‌లో ఆడుతున్నాయి. పురుషుల, మహిళల జట్లను రెండు నాలుగు గ్రూపులుగా విభజించారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో గ్రూప్ లీగ్‌లో ప్రతి జట్టు తన గ్రూప్‌లోని మిగిలిన జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. లీగ్ పోటీలు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన రెండు జట్లు నాకౌట్(క్వార్టర్‌ఫైనల్స్)కు చేరతాయి. తొలిసారి జరిగే ఖోఖో ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యమిస్తోంది.

పురుషుల జట్టు...
గ్రూప్-ఎ: భారత్, నేపాల్, బ్రెజిల్, పెరూ, బూటాన్
గ్రూప్-బి: దక్షిణాఫ్రికా, ఘనా, అర్జెంటీనా, నెదర్లాండ్స్, ఇరాన్
గ్రూప్-సి: బంగ్లాదేశ్, శ్రీలంక, దక్షిణ కొరియా, అమెరికా, పోలండ్
గ్రూప్-డి: ఇంగ్లండ్, జర్మనీ, మలేషియా, ఆస్ట్రేలియా, కెన్యా

మహిళల జట్టు...
గ్రూప్-ఎ: భారత్, దక్షిణ కొరియా, ఇరాన్, మలేషియా
గ్రూప్-బి: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెన్యా, ఉగాండా, నెదర్లాండ్స్
గ్రూప్-సి: నేపాల్, భూటాన్, శ్రీలంక, జర్మనీ, బంగ్లాదేశ్
గ్రూప్-డి: దక్షిణాఫ్రికా, పోలండ్, పెరూ, ఇండోనేషియా, న్యూజిలాండ్.

భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్...

పురుషులు...		మహిళలు..	
13(సోమ)	భారత్ × నేపాల్	14(మంగళ)	భారత్ × ద.కొరియా
14(మంగళ)	భారత్ × బ్రెజిల్	15(బుధ)	భారత్ × ఇరాన్
15(బుధ)	భారత్ × పెరూ	16(గురు)	భారత్ × మలేషియా
16(గురు)	భారత్ × బూటాన్	17(శుక్ర)	క్వార్టర్‌ఫైనల్స్
17(శుక్ర)	క్వార్టర్‌ఫైనల్స్	18(శని)	సెమీఫైనల్
18(శని)	సెమీఫైనల్స్	19(ఆది)	ఫైనల్
19(ఆది)	ఫైనల్		

నోట్: రాత్రి 7.00గం॥ల నుంచి

వాళ్ల కోసమే జీవిస్తున్నాను..




తెలుగు, తమిళం భాషల్లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన గౌతమ్ మీనన్ సుపరిచితుడే. నాగచైతన్య, సమంత జంటగా నటించిన 'ఏ మాయ చేసావే' సినిమాతో మరింత పాపులారిటీ సంపాదించుకున్న ఈ దర్శకుడు తాజాగా ఓ మీడియా సమావేశంలో తాను పడ్డ మానసిక వేదన గురించి మాట్లాడారు. 'ఈ విషయాల గురించి మీతో పంచుకోవద్దు అనుకున్నా కానీ ఎంతో బాధగా ఉంది. ఇండస్ట్రీలో నాకు సహాయం చేయడానికి ఎవరూ లేరు. మీకు నమ్మడానికి కష్టంగా ఉన్నా ఇది నిజం. నేను తీసిన 'ధ్రువ నక్షత్రం' విడుదల విషయంలో సమస్యల గురించి ఎవరూ స్పందించలేదు. కనీసం ఆ మూవీ విషయంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి కూడా ప్రయత్నించలేదు. ధనుష్, లింగుస్వామి మాత్రమే దాని గురించి అడిగారు. విడుదల చేయడానికి ప్రయత్నించారు. కొన్ని స్టూడియోల వారికి ఈ సినిమాను చూపించాను. ఎవరూ దాన్ని స్వీకరించలేదు. విడుదల చేయడానికి ముందుకు రాలేదు. కానీ ప్రేక్షకులు ఇంకా నా సినిమాలు చూడాలని కోరుకుంటున్నారు. వారి కోసమే నేను బతికి ఉన్నాను' అన్నారు.

120 మందిని దత్తత తీసుకున్నా



తిరుపతిలోని బైరాగి పట్టెడ ప్రాంతానికి చెందిన మాతృశ్య సంస్థకు చెందిన 120 మంది అనాథలను మంచు విష్ణు దత్తత తీసుకున్నారు. 'విద్యా, వైద్యంతో పాటు అన్ని విషయాల్లో ఓ కుటుంబ సభ్యుడిలా వారికి తోడుంటాన'ని తెలిపారు. 'ఎలాంటి స్వలాభం లేకుండా మంచి హృదయంతో మాతృశ్య నిర్వాహకురాలు శ్రీదేవి అనాథలను ఆదరిస్తున్నారని, వారికి అన్నగా, పెద్దగా తోడు ఉంటానని, వారంతా నా కుటుంబ సభ్యులే' అని అన్నారు. 'అనవసరమైన ఖర్చులు తగ్గించుకుని అందుబాటులో ఉన్న అనాథలకు ప్రతి ఒక్కరూ సాయం చేయాల'నీ కోరారు.

రేసింగ్‌లో సత్తా చాటిన అజిత్



దుబాయ్ కారు రేసింగ్‌లో మూడోస్థానంలో నిలిచి సత్తా చాటిన అజిత్ సినీ, రాజకీయ ప్రముఖుల నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ రేసింగ్‌కు రెండు రోజుల ముందు ఆయన ఓ పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారు. 'అజిత్ కుమార్ రేసింగ్' పేరుతో ఇటీవల ఒక రేసింగ్ టీమ్‌ను ప్రకటించిన ఆయన తాజాగా తన టీమ్‌తో కలిసి దుబాయ్ వేదికగా జరుగుతోన్న 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజిత్, తన భార్య షాలినీకి థాంక్స్ చెప్పారు. 'షాలు... నన్ను ఈ రేసులో పాల్గొనడానికి అనుమతించినందుకు నీకు ధన్యవాదాలు' అని చెప్పారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, ఇంగ్లీష్ భాషలు అనర్గళంగా మాట్లాడే అజిత్, తెలుగు, తమిళంలో అనేక హిట్ చిత్రాల్లో నటించి టాప్ హీరోగా ఎదిగారు. అజిత్ ప్రొఫెషనల్ రేసర్ కూడా. 2004లో బ్రిటిష్ ఫార్ములా 3, ఫార్ములా 2 రేసుల్లో పాల్గొన్నాడు. ఇంకా ప్రొఫెషనల్ షూటర్. తమిళనాడులో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో 4 బంగారు పతకాలు సాధించాడు. అజిత్ విమానాన్ని సైతం నడపగలడు. ఒక మోటార్ కంపెనీకి కమర్షియల్ యాడ్ చేయడానికి వెళ్లినప్పుడు సినిమాటోగ్రాఫర్ కమ్ డైరెక్టర్ పీసీ శ్రీరామ్ సినిమాల్లో ఛాన్స్ ఇచ్చారు. ప్రస్తుతం అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో నటిస్తున్నారు.

'పూర్తి వినోదాత్మక కథతో సరికొత్తగా..'



'సమాజ పరిస్థితులకు దగ్గరగా, కుటుంబం అంతా కలిసి చూసేలా ఉండే ప్రేమ కథా చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అందుకే ప్రేక్షకుల ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా మేము కొత్త సినిమాలను తెరకెక్కించబోతున్నాం. మూస కథలు తీస్తే ఎవ్వరూ చూడరు. కొత్త అంశాలు ఉండాలి. అది కూడా వాస్తవికతకు దగ్గరగా ఉండాలి. మానవీయవిలువలు అందులో జొప్పించాలి. అలా కథ సాగితే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా మా బ్యానర్‌లో పలు కొత్త సినిమాలు తీయబోతున్నాం. కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నాం. ఎస్‌పి క్రియేషన్స్ బ్యానర్‌పై ఉగాది రోజున 'యమజాలీ లవ్‌మీ లైలా' సినిమా షూటింగ్‌ను ప్రారంభించబోతున్నాం. ముహూర్తపు షాట్‌ను విజయవాడలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల సన్నిధిలో చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ చిత్రం పూర్తిగా కుటుంబ కథాచిత్రంగా ఉంటుంది. దురాశతో ఓ యువతి యముడు ఒంటిపై ఉన్న బంగారాన్ని దొంగిలించేందుకు చేసే విచిత్ర ప్రయోగాలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి. మొత్తం ఐదు పాటలు కూడా అలరిస్తాయి. ఈ సినిమా తర్వాత 'ప్రేమిస్తే నేరమా?', ఆ తర్వాత 'శ్రీ భగవాన్ సత్యసాయి యుగం' చిత్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబోతున్నాం' అని దర్శకుడు సాయిపవన్ సుంకర, నిర్మాత మహేశ్వర కె.అన్నారు. సంక్రాంతి సందర్భంగా కొత్త సినిమా విశేషాలను వారు పంచుకున్నారు.

ఫిబ్రవరిలో 'శివంగి' విడుదల



'క్లాస్, మాస్ ప్రేక్షకులను మెప్పించేలా మా చిత్రం 'శివంగి' సినిమా రూపు దిద్దుకుంది. యాక్షన్, కామెడీ, హర్రర్ అంశాలు అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. ఓ పోలీసాఫీసర్ సతీమణి శివంగి. విలన్ శివంగి ఫ్యామిలీని చంపేస్తాడు. అది కళ్లారా ఆమె చూస్తుంది. ఆ తర్వాత ఆమె తన పగను ఎలా తీర్చుకుంటుందనే ఇతివృత్తంతో ఈ సినిమా తెరకెక్కింది. అద్భుతమైన విజువల్స్ ఉంటాయి. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని భావిస్తున్నాం' అని డైరెక్టర్ మూర్తి బాందేపురపు అన్నారు. సంక్రాంతి సందర్భంగా కొత్త పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. ఫిబ్రవరిలో ఈ సినిమాను విడుదల చేయటానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మూర్తి నంబర్ వన్ ఇందులో తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. దివ్యశ్రీ, వెంకీ, రాజశ్రీ నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్టులుగా కోట శంకరరావు, చిత్రం శ్రీను, జెన్ని పలాస, రామతీర్థ, పొట్టి చిట్టిబాబు, సంధ్య, చాందిని, బొబ్బిలి విజయ్, పందిరి కృష్ణ, లక్ష్మణ్‌చౌదరి, నాని, కనకదుర్గ, డబుల్ ఎక్స్ శివ, గడ్డం శివ, వై.పవన్‌కుమార్, ఎస్‌కె రెహ్మాన్, వడ్డీశ్వరం కుమార్, విఆర్‌ఒ రామారావు, రాణి, నాగేశ్వరరావు, కెమెరామెన్ రమేష్, కొరియోగ్రఫీ, ఎస్‌కె ఖాదర్, ఫణీంద్ర కుమార్, సంగీతం చదివే దేవేంద్ర, స్క్రీన్‌ప్లే కథ, డైలాగ్స్, దర్శకత్వం, నిర్మాత మూర్తి బాందేపురపు. శ్రీ స్వర్ణ వరల్డ్ మూవీస్ బ్యానర్‌పై బి.నాగవర్ధిని సమర్పణలో ఈ సినిమా తెరకెక్కింది.

ఉక్కిరిబిక్కిరి !



హెచ్-1బి వీసా రగడతో భారతీయ ఉద్యోగుల్లో ఆందోళన

- అందరి దృష్టీ ట్రంప్ నిర్ణయం పైనే
- ఆచితూచి స్పందిస్తున్న కంపెనీలు
- అడకత్తెరలో పోకచెక్కలా నిపుణులు

న్యూఢిల్లీ : అమెరికాలో హెచ్-1బి వీసా సంస్కరణలపై వాడిగా, వేడిగా చర్చ కొనసాగుతున్న వేళ దేశంలోని వృత్తి నిపుణులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అమెరికాలో అధికారంలోకి రాబోతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టబోతోందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆఫర్ లెటర్లు పొందిన ఐటి నిపుణులకు ఆశాభంగం ఎదురవుతోంది. ఆ లెటర్లను కంపెనీలు ఉపసంహరించుకుంటున్నాయి. వీసాలు ఆలస్యమవుతున్నాయి. లేఔట్ల హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

రెంటికీ చెడ్డ రేవడిలా...

తమకు ఇచ్చిన జాబ్ ఆఫర్ లెటర్లను వీసా సంబంధిత సమస్యల కారణంగా కంపెనీలు రద్దు చేస్తున్నాయని కొందరు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అమెరికాలోని టెక్ సంస్థ డిసెంబరులో ఉద్యోగంలోకి తీసుకుంది. విధుల్లో చేరడానికి శాన్‌ఫ్రాన్సిస్కో బయలుదేరేందుకు సిద్ధపడుతుండగా అశనిపాతం వంటి వార్త వచ్చింది. ఆమెకు ఇచ్చిన ఆఫర్‌ను కంపెనీ వెనక్కి తీసుకుంది. కొత్త ఉద్యోగంలో చేరబోతున్నానన్న ఆనందంలో ఆమె ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇప్పుడు ఆ ఇంజినీర్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. '2024 డిసెంబర్‌లో నాకు జాబ్ ఆఫర్ వచ్చింది. నాకు లిఖితపూర్వకంగా సమాచారం అందడంతో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేశాను. ఇప్పుడు ఏం చేయాలి?' అంటూ ఆవేదనతో ప్రశ్నించారు.

వీసా నిబంధనల్లో వచ్చిన మార్పుల కారణంగా ఆఫర్ లెటర్‌ను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ చెబుతోంది. దీనిపై ఆ మహిళా ఇంజినీర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నన్ను మోసం చేశారు. వీసా స్పాన్సర్ చేయగలమా? లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోకుండానే నాకు ఉద్యోగం ఎలా ఇచ్చారు? పరిస్థితి చక్కబడిన తర్వాత మళ్లీ ఆఫర్ లెటర్ ఇస్తామని వారు చెబుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్దిష్టంగా నిర్ణయం తీసుకుంటామని అంటున్నారు. కానీ నేను ఎంతకాలం ఎదురు చూడాలి?' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కారాలు మిరియాలు నూరుతున్న 'మాగా'

అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అందజేసిన సమాచారం ప్రకారం 2023లో జారీ చేసిన 3,80,000 హెచ్-1బీ వీసాల్లో 72 శాతం భారతీయులకే అందాయి. వీరిలో చాలా మంది డాటా సైన్స్, ఎఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో పనిచేస్తున్నారు. వీరికి ఏటా రూ.1.01 కోట్ల వార్షిక వేతనం అందుతోంది. అమెరికా ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా హెచ్-1బి కార్యక్రమాన్ని సంస్కరించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నందున ముందుందు సవాళ్లు తప్పవని అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు హెచ్-1బి వీసా అంటేనే మండిపడుతున్న 'మాగా' ఉద్యమకారులు మనపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఈ కార్యక్రమం అమెరికా ఉద్యోగాలు, వేతనాలను దెబ్బతీస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా వీసా రెన్యువల్స్ కోసం ఎదురు చూస్తున్న వారిని నిరుద్యోగ భయం వెంటాడుతోంది. హెచ్-1బీ వీసా స్పాన్సర్‌షిప్ ఆలస్యమవుతుండడంపై లాస్ ఏంజెల్స్‌లోని సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్ మాట్లాడుతూ 'ఈ ప్రక్రియను వేగవంతం చేస్తామని మొదట్లో కంపెనీ హామీ ఇచ్చింది. ఇప్పుడేమో వీసా సంస్కరణలపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నామని చెబుతోంది. ఈ ఎదురు చూపులు ఆవేదన కలిగిస్తున్నాయి' అని చెప్పారు.

వీసా చుట్టూ వివాదం

మాస్టర్ డిగ్రీ కోసం నాగపూర్ నుండి అమెరికా వెళ్లిన మరో యువతి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. 'ఈ ఏడాది మార్చిలో వీసా లాటరీ కోసం నా పేరు రిజిస్టర్ చేస్తామని చెప్పారు. అయితే వారు ఇప్పటికీ ఆ ప్రక్రియ ప్రారంభ దశలను మొదలు పెట్టలేదు. మా హెచ్-1బిని తర్వాత ఫైల్ చేస్తారా? లేక చివరికి మొండిచేయి చూపుతారా?' అని ఆమె మథనపడుతున్నారు. తెలంగాణకు చెందిన ఓ మహిళ వ్యథ మరోలా ఉంది. ఉద్యోగం కోసం ఎదురు చూపుల అనంతరం ఆమె ఇటీవలే డాటా అనలిస్ట్‌గా ఎంపికైంది. వీసా స్పాన్సర్‌షిప్ గురించి ఇప్పుడు ఏమీ చెప్పడం లేదు. మరోసారి నన్ను నిరుద్యోగం వెంటాడుతుందా? ఏమో...' అని దిగాలుగా అన్నారు. కాలిఫోర్నియాలో పనిచేస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఏమంటున్నారంటే 'నాకు వీసా ఉంది. అయితే మా కంపెనీ ఇటీవలే ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. అదే ఆందోళన కలిగిస్తోంది. ఈ తొలగింపులకు, వీసా సమస్యకు ఏదైనా సంబంధం ఉన్నదా అనే విషయంపై మా కంపెనీ స్పష్టత ఇవ్వడం లేదు. ఒకవేళ ఉద్యోగం పోతే 60 రోజుల్లో మరోటి వెతుక్కోవాల్సి ఉంటుంది. అప్పుడే ఇక్కడ ఉండగలం' అని చెప్పారు. నిరుద్యోగం రికార్డు స్థాయిలో ఉన్నదని, భారతీయ ఇమ్మిగ్రెంట్లలో అస్థిరత పెరుగుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ సమయంలో హెచ్-1బి స్పాన్సర్‌షిప్‌తో కొత్త ఉద్యోగం దొరకడం కష్టమేనని ఆయన పెదవి విరిచారు.

నిబంధనలు కఠినంగా ఉండడంతో యాజమాన్యాలు విదేశాలకు చెందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి వెనకాడుతున్నారని, స్పాన్సర్‌షిప్‌ల కోసం పెట్టుబడులు పెట్టి తీరా అవి తిరస్కరణకు గురైతే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారని జార్జియాకు చెందిన ఇమ్మిగ్రేషన్ న్యాయవాది తెలిపారు. దురదృష్టవశాత్తూ ఈ అస్థిరతను ఉద్యోగులే భరించాల్సి వస్తోందని ఆయన అన్నారు.

సిపిఎం హర్యానా రాష్ట్ర కార్యదర్శిగా ప్రేమ్‌చంద్



చండీగఢ్ : మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం హర్యానా రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ సభలో 30 మందితో కూడిన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కార్యదర్శిగా ప్రేమ్‌చంద్‌ను ఎన్నుకున్నారు. అలాగే 9 మంది సభ్యులతో కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. వీరిలో సురేంద్ర సింగ్, ఇంద్రజిత్ సింగ్, జై భగవాన్, రమేష్ చంద్ర, జగ్తార్, దినేష్ శివాచ్, ఓం ప్రకాశ్, సవితా ఉన్నారు. మహాసభ ముగింపు సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు హేమలత, పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు ప్రసంగించారు.

క్యాసినోకు చట్టబద్ధత..

- బిల్లుకు థాయ్‌లాండ్ ఆమోదం
- ఉద్యోగాల కల్పన కోసమే : ప్రధాని పేటోంగ్టార్న్
- అక్రమ జూదక్రీడను అడ్డుకోలేకే ఇలాంటి అడ్డదార్లు : థాయ్‌లాండ్ పీపుల్స్

బ్యాంకాక్ : క్యాసినో, గ్యాంబ్లింగ్‌కు సంబంధించి ప్రతిపాదిత బిల్లుకు థాయ్‌లాండ్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వస్తే థీమ్, వాటర్ పార్కులు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ వంటి టూరిజం కాంప్లెక్సుల్లో క్యాసినోల ఏర్పాటుకు అనుమతికి వీలుంటుంది. ఇందుకు సంబంధించిన బిల్లు వివాదాస్పదమైనప్పటికీ.. పర్యాటకానికి మరింత ఊతమివ్వడంతోపాటు ఉద్యోగాల కల్పన కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు థాయ్ ప్రభుత్వం వెల్లడించింది. థాయ్‌లాండ్‌లో ప్రభుత్వం నిర్వహించే గుర్రపు పందేలకు మాత్రమే అనుమతి ఉంది. కానీ, అక్రమ బెట్టింగ్ దేశ వ్యాప్తంగా భారీ స్థాయిలో కొనసాగుతుంది. ఇటువంటి అక్రమ జూదం సమస్యను పరిష్కరించడంతోపాటు ఆదాయాన్ని పెంచడం, థాయ్‌లాండ్‌లో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యాలతో తాజా నిర్ణయం తీసుకున్నామని ప్రధాని మంత్రి పేటోంగ్టార్న్ పేర్కొన్నారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం.. 20ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారికి క్యాసినోలకు అనుమతి ఉండదు. విదేశీయులకు ఉచిత ప్రవేశం. థాయ్ పౌరులు మాత్రం రూ.148 డాలర్ల ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

గ్యాస్‌పైప్‌లైన్‌పై దాడికి ఉక్రెయిన్ యత్నం

మాస్కో : దక్షిణ రష్యాలోని టర్క్‌స్ట్రీమ్ గ్యాస్ పైప్‌లైన్ మౌలిక సదుపాయంపై ఉక్రెయిన్ దాడికి యత్నించినట్లు రష్యా ప్రకటించింది. పైప్‌లైన్‌లో కొంతభాగాన్ని ధ్వసం చేసేందుకు యత్నించిన తొమ్మిది ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. ఈ పైప్‌లైన్ నుండి టర్కీ, యూరప్‌కు రష్యా గ్యాస్‌ను సరఫరా చేస్తుంది.

దక్షిణ రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని కంప్రెషర్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకుందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే పైప్‌లైన్ యథావిధిగా పనిచేస్తోందని, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. ఒక డ్రోన్ శకలాలు పడిపోవడంతో భవనం, కంప్రెషర్ వద్ద ఉన్న గ్యాస్ మీటరింగ్ స్టేషన్ సామగ్రికి స్వల్ప నష్టం వాటిల్లిందని, అయితే అత్యవసర బృందాలు వెంటనే మరమ్మత్తులు చేశాయని రష్యా ఓ ప్రకటనలో పేర్కొంది.

గ్యాస్ పైప్‌లైన్ అనపా నగరం వెలుపల ఉన్న రస్కయా కంప్రెషర్ స్టేషన్ నుండి గ్యాస్ పైప్‌లైన్ ప్రారంభమై, టర్కీలోని కికోయ్ వరకు, అక్కడి నుండి యూరప్‌కు వెళుతుంది.

మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషి

- ఎల్‌ఎసి వద్ద పరిస్థితిని చక్కదిద్దటానికి కార్ప్స్ కమాండర్లకు అధికారం : ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఇంకా హింసాకాండ కొనసాగుతూనే ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. అక్కడ శాంతి స్థాపనకు సాయుధ బలగాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. సోమవారం ఇక్కడ మనేక్ష సెంటర్‌లో నిర్వహించిన వార్షిక విలేకరుల సమావేశంలో ఉపేంద్ర ద్వివేది మాట్లాడారు. ఈ సమావేశంలో సరిహద్దుల్లో భద్రతా సమస్యలు గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ద్వివేది పైవిధంగా సమాధానం ఇచ్చారు. మయన్మార్ సరిహద్దుల్లో మెరుగైన నిఘా వ్యవస్థ ఉందని, ఫెన్సింగ్ కూడా పురోగతిలో ఉందని తెలిపారు. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఎసి) వద్ద కూడా ప్రతిష్టంభన నెలకొందని ఆర్మీ చీఫ్ సోమవారం అంగీకరించారు. ఇక్కడ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి కార్ప్స్ కమాండర్లకు అధికారం ఇచ్చినట్లు చెప్పారు. దీనివల్ల పెట్రోలింగ్, పశువుల మేతకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలు సైనిక స్థాయిలోనే పరిష్కారమవుతాయని తెలిపారు. ఎల్‌ఎసి వద్ద పరిస్థితి సున్నితమైనదే అయినా, ప్రస్తుతం అక్కడ పరిస్థితి స్థిరంగా ఉందని ఆర్మీ చీఫ్ తెలిపారు. కైలాష్ మానస సరోవర్ యాత్రను పున:ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తూర్పు లడఖ్ వద్ద బలగాల ఉపసంహరణపై ఆర్మీ చీఫ్ సంతృప్తి వ్యక్తం చేశారు. చైనాతో తదుపరి ప్రత్యేక ప్రతినిధుల సమావేశం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

పాకిస్థాన్‌తో నియంత్రరేఖ (ఎల్‌ఓసి) వద్ద పరిస్థితి గురించి ద్వివేది మాట్లాడుతూ ఈ రేఖ వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని, చొరబాటు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సైన్యంలో గతేడాది అదనంగా 15 వేల మంది సైనికులను అదనంగా చేర్చుకున్నామని, జమ్ముకాశ్మీర్‌లో హింసాకాండ స్థాయిని తగ్గించగలిగామని, 73 మంది ఉగ్రవాదులను హతమార్చగలిగామని చెప్పారు. జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు 60 శాతం ఓటింగ్ జరిగిందని, ఇది ఇక్కడి ప్రజలు హింసను విస్మరిస్తున్నారని అనడానికి నిదర్శమని ఆర్మీ చీఫ్ తెలిపారు. జనవరి 15న ఆర్మీ డే సందర్భంగా ఈ వార్షిక మీడియా సమావేశం నిర్వహించారు.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2023-24 వార్షిక నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో ఈశాన్య భారతంలో జరిగి హింసాత్మక సంఘటనల్లో 77 శాతానికి పైగా మణిపూర్‌లోనే జరిగాయి. మణిపూర్‌లో పరిస్థితి గురించి ఇటీవల ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ హింసాకాండను నిలువరించడానికి రాష్ట్ర పోలీసులు జాతీయ భద్రతా చట్టం 1980ను ప్రయోగించాలని సూచించారు. ఈ చట్టం ప్రకారం అనుమానితుల్ని ఎలాంటి విచారణ లేకుండా ఒక ఏడాది పాటు నిర్బంధించవచ్చు. మణిపూర్‌లో 2023 మే 3న ప్రారంభమైన హింసాకాండలో ఇప్పటి వరకూ 250 మందికి పైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

హమాస్-ఇజ్రాయిల్ చర్చల్లో పురోగతి!



అమెరికా విదేశాంగమంత్రి అంటోనీ బ్లింకెన్‌తో ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్

గాజా సిటీ: కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి సాధించాయని, రేపోమాపో ముసాయిదా ఒప్పంద ప్రతులను ఇరు పక్షాలు మార్పిడి చేసుకోనున్నాయని పేరు తెలపడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపినట్లు అసోసియేటెడ్ ప్రెస్ వార్తా సంస్థ పేర్కొంది. బందీల విడుదల, కాల్పుల విరమణకు సంబంధించి మధ్యవర్తిత్వం వహించిన అరబ్, అమెరికా ప్రతినిధులను ఉటంకిస్తూ అధికారులు ఈ విషయం తెలిపారు. అయితే దీనిపై ఇరు పక్షాలు ఒక ఒప్పందానికి రావడానికి ఇంకా కొన్ని అవరోధాలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తే ఒప్పందానికి మార్గం సుగమం అవుతుందని హమాస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. గతంలో కూడా అమెరికా అధికారులు ఒప్పందం దాదాపు ఖరారైపోయిందన్నట్టుగా ఇలాగే ప్రకటనలిచ్చారు. కానీ, అవేవీ వాస్తవ రూపం దాల్చలేదు. ఇది కూడా అటువంటి ప్రచారమేనా అన్న అనుమానం కలుగుతోంది. అందునా, మరో వారం రోజుల్లో అధ్యక్షుడిగా పదవి నుంచి నిష్క్రమించనున్న బైడెన్ ప్రభుత్వం జరిపే చర్చలకు ఏపాటి విలువ ఉంటుందన్నది ప్రశ్న. పదిహేను మాసాలుగా సాగుతున్న ఇజ్రాయిల్ దురాక్రమణ పూరిత దాడులకు స్వస్తి చెబితేనే బందీల విడుదల గురించి ఆలోచిస్తామని హమాస్ ఎప్పటి నుంచో చెబుతోంది. బందీలను బేషరతుగా విడుదలజేయాలని, ఆ తర్వాతే కాల్పుల విరమణ గురించి పరిశీలిస్తామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అనడంతో చర్చల ప్రక్రియ ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. పశ్చిమాసియాను అస్థిరపరిచేందుకు అమెరికా అండతో ఇజ్రాయిల్ ఇష్టానుసారంగా చెలరేగిపోతోంది. గాజాలో మొదలై యెమెన్, లెబనాన్, సిరియా కు దాడులను విస్తరింపజేసేందుకు ఇజ్రాయిల్ యత్నిస్తోంది. తాజా చర్చల విషయానికి వస్తే మధ్యవర్తిత్వం వహిస్తున్న గల్ఫ్ దేశం ఖతార్ ఇజ్రాయిల్‌తో ఏదో ఒక రకమైన ఒప్పందానికి రావాలని హమాస్‌పై ఒత్తిడి పెంచుతున్నట్లు వార్తలొస్తున్నాయి. మరో వైపు ట్రంప్ దూత స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల ఈ చర్చల్లో పాల్గొని హమాస్‌తో ఒప్పందానికి రావాలని ఇజ్రాయిల్‌ను కోరినట్లు పాశ్చాత్య మీడియా తెలిపింది.



కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ప్రధాని
చిత్రంలో చిరంజీవి, తదితరులు

సంప్రదాయాలతో పెనవేసుకున్న గొప్ప వేడుక : మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సంక్రాంతి పండుగ భారత దేశ సంస్కృతిలో వ్యవసాయ సంప్రదాయాలతో లోతుగా పెనవేసుకున్న సమృద్ధి, కృతజ్ఞత, పునరుద్ధరణ వేడుకలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సోమవారం న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో సోమవారం నిర్వహించిన భోగి వేడుకలకు ప్రధాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, భూపతి రాజు శ్రీనివాస్ రాజు, బండి సంజయ్, ప్రముఖ సినీ హీరో చిరంజీవి, క్రీడాకారాణి పివి సింధు, సింగర్ సునీత తదితరులు హాజరయ్యారు. స్పీకర్ ఓంబిర్లా, చిరంజీవితో కలిసి సంక్రాంతి సంబరాలను మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల సంగీత నృత్యాన్ని వీక్షించారు. సింగర్ సునీత తన పాటలతో అందర్ని అలరించారు. ముగింపులో భాగంగా ప్రధాన మోడీకి కిషన్‌రెడ్డి శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమం అనంతరం ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఒక అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించినట్లు పేర్కొన్నారు. తెలుగు, దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరికీ సంతోషం, మంచి ఆరోగ్యం, సంపన్నమైన పంటలు అందించాలని భగవంతుడిని కాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రంప్‌తో విభేదించిన వాన్స్..

- క్యాపిటల్ హిల్ ఘటనలో నిందితులకు క్షమాభిక్షపై భిన్నాభిప్రాయాలు

న్యూయార్క్ : డోనాల్డ్ ట్రంప్ - జెడి వాన్స్ ఇంకా ప్రమాణస్వీకారం కూడా చేయలేదు. అప్పుడే ఇద్దరికీ కొన్ని అంశాల్లో స్వల్ప అభిప్రాయ భేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. 'క్యాపిటల్ హిల్' ఘటనలో నిందితులకు క్షమాభిక్ష అంశంపై వారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఇప్పటికే వారికి తన అధికారాలను ఉపయోగించి కేసుల నుంచి విముక్తి కల్పిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాన్స్ మాత్రం సహజంగానే వారికి ఎటువంటి క్షమాభిక్ష ఇవ్వకూడదని చెబుతున్నారు. తాజాగా ఫ్యాక్స్ న్యూస్‌లో జరిగిన కార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ "ఇది చాలా సింపుల్. నాడు మీరు శాంతియుతంగా ఆందోళన చేసినట్లైతే.. మిమ్మల్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఓ గ్యాంగ్ సభ్యుల్లా ట్రీట్ చేసేది. మీకు క్షమాభిక్ష కూడా లభించేది. ఒకవేళ మీరు ఆ రోజు హింసకు పాల్పడితే.. మీకు క్షమాభిక్ష రాదు. దీనిపై కొంత అస్పష్టత ఉంది. జనవరి 6వ తేదీ నాటి అల్లర్లకు సంబంధించి చాలామంది అమాయకులు విచారణను ఎదుర్కోవడం సరికాదు. దానిని మనం సరిచేయాలి" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై క్యాపిటల్ హిల్స్ ఘటనకు మద్దతు తెలిపేవారు వాన్స్‌ను తీవ్రంగా విమర్శించడం మొదలుపెట్టారు. దీనికి మళ్లీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన వివరణ పోస్టు చేశారు. " మొదటగా నేను చెప్పేది ఏమిటంటే.. జె6 (జనవరి 6) ఖైదీల నిధికి నేను కూడా విరాళం ఇచ్చాను. నేను సెనెట్ బరిలో నిలిచిన వేళ ఈ విషయాన్ని చాలామంది విమర్శించారు. నేను చాలా ఏళ్లుగా వీరిని రక్షిస్తున్నాను. రెండోది.. నాడు జనసమూహంలో ఫెడరల్ ఇన్ఫార్మర్లు ఉన్నారు. వారికి క్షమాభిక్ష లభిస్తుందా..? అలాగని నేను అనుకోను. అధ్యక్షుడు ప్రతి కేసును తాను పరిశీలిస్తానని చెప్పారు. (నేను కూడా అదే చెబుతున్నాను) అలా అంటే కొంత వెనక్కి తగ్గినట్టు కాదు. అన్యాయంగా జైళ్లకు వెళ్లినవారిని రక్షిస్తాం. ఎవరి ప్రభావానికో లోనై రెచ్చిపోయిన వారు, చెత్త విచారణలు ఎదుర్కొంటున్న వారు కూడా వీరిలో ఉన్నారు" అని రాసుకొచ్చారు.

తాను అధికారం చేపట్టిన తొలిరోజే క్యాపిటల్ హిల్స్ ఘటనలో నిందితులకు క్షమాభిక్షను ప్రకటిస్తానని ట్రంప్ చెప్పారు. ఇటీవల ఎన్‌బిసి మీట్‌ద ప్రెస్‌లో కూడా మాట్లాడుతూ వీలైనంత త్వరగా దీనిని పూర్తి చేస్తానని పునరుద్ఘాటించారు.

అసలు ఏం జరిగింది..?

2020 జనవరి 6వ తేదీన జోబైడెన్ విజయం తర్వాత ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ హిల్ భవనం వద్దకు చేరి ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత వారు అడ్డంకులు తొలగించుకొని ఆ భవనంలోకి చొరబడి అరాచకం సృష్టించారు. వంద మంది పోలీసులు గాయపడ్డారు. సుమారు 1,500 మందిపై దీనికి సంబంధించి కేసులు నమోదు చేశారు. నిందితులకు క్షమాభిక్ష పెడితే.. చట్టాలకు విలువ ఉంటుందా..? ట్రంప్‌కు మద్దతిచ్చే అరాచకశక్తులు మరింత రెచ్చిపోయే ప్రమాదం లేకపోలేదన్న భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

బక్కచిక్కిపోతున్న రూపాయి

- డాలర్‌కు 57 పైసలు పతనమై రూ.86.61లకు..
- క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై తీవ్ర ప్రభావం

న్యూయార్క్. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి రోజురోజుకూ బక్కచిక్కిపోతోంది. సోమవారం 86.61 వద్ద స్థిరపడింది. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఇబ్బందులు తప్పవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు దారితీయొచ్చు. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీసే అవకాశాలున్నాయి.

డిసెంబర్‌లో నాలుగు నెలల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : రిటైల్ ద్రవ్యోల్బణం 2024 డిసెంబర్‌లో నాలుగు నెలల కనిష్టం 5.22 శాతానికి తగ్గినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) పేర్కొంది. ఇది నవంబర్‌లో 5.5 శాతంగా ఉందని తెలిపింది. ఆహార ద్రవ్యోల్బణం నవంబర్‌లో 9.04 శాతం నుండి డిసెంబర్‌లో 8.4 శాతానికి స్వల్పంగా తగ్గిందని ఎన్ఎస్ఒ సోమవారం ప్రకటించింది. 2024 డిసెంబర్‌లో అఖిల భారత స్థాయిలో సంవత్సరానికి ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్న మొదటి ఐదు వస్తువులు బఠాణీలు (89.12శాతం), బంగాళా దుంపలు (68.23 శాతం), వెల్లుల్లి (58.17శాతం), కొబ్బరి నూనె (45.41 శాతం), కాలీఫ్లవర్ (39.42శాతం) అని ఎన్ఎస్ఒ పేర్కొంది. 2024-25 మూడవ త్రైమాసికంలో భారత వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం సగటున 5.63 శాతంగా ఉంది. గత నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అంచనా వేసిన 5.7 శాతం కన్నా స్వల్పంగా తగ్గినట్లు ఎన్ఎస్ఒ తెలిపింది. నెలవారీ ప్రాతిపదికన, డిసెంబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) 0.56 శాతం తగ్గింది. వినియోగదారుల ఆహార ధరల సూచీ (సిఎఫ్‌పిఐ) నవంబర్ కన్నా 1.5 శాతం తక్కువగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం కూడా నాలుగు నెలల కనిష్టానికి తగ్గింది. అక్టోబర్‌లో 15 నెలల గరిష్టస్థాయి 10.9 శాతం నుండి డిసెంబర్‌లో క్షీణతను సూచిస్తుంది. కొన్ని కీలకమైన ఆహార పదార్థాల ధరలు వేగంగా పెరిగాయని పేర్కొంది.

విచారణ త్వరగా పూర్తి చేయాలి..

- బద్లాపూర్ కేసులో బాంబే హైకోర్టు ఆదేశాలు

ముంబయి. బద్లాపూర్ పాఠశాలలో జరిగిన లైంగిక వేధింపుల కేసు విచారణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బాంబే హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. థానేలోని బద్లాపూర్ ప్రాంతంలోని పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై స్కూల్ అటెండర్ లైంగిక దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్‌లో నిందితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత కేసు దర్యాప్తు చేసేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. పోక్సో చట్టంలోని నిబంధనల ప్రకారం.. పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు ఇద్దరు వ్యక్తులపై చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో బద్లాపూర్ స్థానిక పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని వెలుగు చూడడంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించింది.

సుమోటోగా తీసుకొని కేసు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో సోమవారం బాంబే హైకోర్టు విచారణ జరిపింది. జస్టిస్ రేవతి మోహితే డెరే, నీలా గోఖలే విచారణ జరుపగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ హితెన్ చార్జిషీట్ దాఖలు చేశామని.. కేసు విచారణ జరుగుతుందని తెలిపారు. దాంతో ధర్మాసనం స్పందిస్తూ బాధితులు చిన్నపిల్లలని.. కేసును త్వరగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. పోక్సో చట్టం ప్రకారం.. బాలికల విచారణ సమయంలో ఓ మహిళా ప్రాసిక్యూటర్ హాజరు కావాలని బెంచ్ ఆదేశించింది. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సహాయం చేసేందుకు మహిళా ప్రాసిక్యూటర్‌ను నియమించినట్టు తెలిపారు. కేసు విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు కేసు స్టేటస్‌ను ప్రాసిక్యూషన్‌కు తెలపాలని చెప్పింది. గతేడాది పాఠశాలలు, విద్యాసంస్థల్లో పిల్లల భద్రతను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. కమిటీ సిఫారసులపై నివేదికను సమర్పించాలని ఉందని పిపి ధర్మాసనానికి విచారణ సందర్భంగా వెల్లడించారు. రాబోయే విచారణ తేదీ నాటికి నివేదికను సమర్పిస్తే.. పరిశీలిస్తామని చెప్పింది. ఈ కేసులో నిందితుడి ఎన్‌కౌంటర్‌పై తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణ జరుగనున్నది. తన కొడుకును పోలీసులు ఫేక్ ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం ఈ నెల 20న హైకోర్టు విచారించనున్నది.

భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు..

- 23,100 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బలహీన సంకేతాల నడుమ ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే బాటలో పయనించాయి. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, జొమాటో, ఎల్అండ్‌టీ షేర్లలో విక్రయాలు సూచీలపై మరింత ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 23,100 దిగువన ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 76,629.90 (క్రితం ముగింపు 77,378.91) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా కోల్పోయి 76,249.72 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1,048.90 పాయింట్ల నష్టంతో 76,330.01 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.55 పాయింట్ల నష్టంతో 23,085 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద స్థిరపడింది.

భారత్‌లో యాపిల్ జోరు.. 2024లో రూ.లక్ష కోట్లు ఐఫోన్ ఎగుమతులు దాటాయి.

సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, ఎన్‌టిపిసి, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టపోయాయి. టిసిఎస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.83 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,708.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవే..

ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు కూడా మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. జపాన్ నిక్కీ, హాంకాంగ్, ఎఎస్ఎక్స్ మార్కెట్లు ఒక శాతం మేర నష్టాల్లో ముగిశాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం మన మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా బాండ్ రాబడులు పెరగడం కూడా మరో కారణమంటున్నారు.

నలుగురు పిల్లల్ని కంటే రూ.లక్ష నజరానా

- బ్రాహ్మణులకు పరశురామ్ కల్యాణ్ బోర్డు అధ్యక్షుడు పిలుపు
- ఇదేమి జాఢ్యం : మహిళా సంఘాల మండిపాటు

భోపాల్ : మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పరశురామ్ కల్యాణ్ బోర్డు ఓ ప్రకటన చేసింది. తమ కమ్యూనిటీని పెంచుకునేందుకు ఎక్కువమంది సంతానాన్ని కనాలని, నలుగురు పిల్లలను కనే బ్రాహ్మణ దంపతులకు రూ.లక్ష నజరానా ఇస్తామని ప్రకటించింది.

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పరశురామ్ కల్యాణ్ బోర్డు అధ్యక్షుడు పండిత్ విష్ణు రాజోరియా ఈ ప్రకటన చేశారు. "మనం మన కుటుంబాలపై దృష్టి పెట్టడం మానేశాం. ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోంది. భవిష్యత్ తరాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. అందుకే కనీసం నలుగురు సంతానం ఉండాలని కోరుతున్నా" అని రాజోరియా తెలిపారు. "నలుగురు పిల్లల్ని కనే మహిళలకు బోర్డు తరఫున రూ.లక్ష నజరానా అందిస్తాం. నేను బోర్డు అధ్యక్షుడిగా దిగిపోయిన తర్వాత కూడా ఈ అవార్డు కొనసాగుతుంది" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్‌గా మారింది.

మహిళల ఆరోగ్యం పట్టదా?

శారీరక, ఆర్థిక సామర్థ్యంతో పాటు మహిళల ఆరోగ్యం గురించి శ్రద్ధ చూపాల్సిన బాధ్యత ప్రతి కులంపైనా ఉన్నది. నేటి సమాజంలో పెరిగిపోతున్న విద్య, వైద్యం తదితర ఖర్చులు, ఆర్థిక భారాలతో ఒక బిడ్డ చాలు అనుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇంతమందిని కంటే.. నజరానా ఇస్తామంటూ ప్రకటనలు చేసే ఆ నేతల కుటుంబాల్లో ఎంతమందిని కంటున్నారు..? వారి చదువు, సంధ్య ఎలా ఉన్నదో పరిశీలించాలని మహిళాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటు రాజకీయాల కోసమే నోటికి వచ్చినట్టు ప్రకటనలు గుమ్మరిస్తున్నారు. ఇలాంటి మత జాఢ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

సంక్రాంతి



సంక్రాంతి పండుగ ఇది
సరదాలకు వేదిక ఇది
ఇంటింటా సంబరాలు
ఆనందపు నిలయాలు

ఆడపడుచుల రాకలు
బంధువుల సందళ్ళు
గారెలు బూరెలు అరిసెలు
నోరూరించే వంటలు

గుమ్మాలకు తోరణాలు
బంతిపూల మాలలు
పండుగ ఆడంబరాల
అందమైన లోగిళ్ళు

ధాన్యపు రాశుల సందడి
రైతులింట హడావుడి
ముస్తాబయ్యే పశువులు
మురిపించే తిరునాళ్ళు

వాకిళ్ళలో విరబూసే
రంగు రంగుల ముగ్గులు
మనసులు మైమరిపించే
గొబ్బెమ్మలు బంతులు

హరిదాసుల కీర్తనలు
అలరించే పాటలు
గంగిరెద్దుల ఆటలు
ఘనమైన వేడుకలు

ఆకశాన అద్భుతాలు
గాలిపటాల రెపరెపలు
అద్భుత విన్యాసాలు
అలరించే సోయగాలు

పల్లె ప్రజలు ఇష్టపడే
కోడిపుంజు పందాలు
ఊరూరా సంబరాలు
ముద్దొచ్చే జాతరలు

జనజీవన గమనంలో
ఏడాదికి ఓ సంక్రాంతి
అనుదినం పొందాలి
నిత్య నూతన క్రాంతి

- నాగరాజు కామర్సు
92480 93580.



మా స్కూల్లో సంక్రాంతి

హాయ్ ఫ్రెండ్స్,

ఈ సంక్రాంతి పండగని మా స్కూల్లో బాగా జరుపుకున్నాం. మాది కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల. రంగవల్లులు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాల ప్రదర్శనలు మేమంతా చాలా ఇష్టంగా చేస్తాం. గంగిరెద్దుల మేళాలు, హరిదాసుల వేషాలు, పిట్టలదొర వేషాలను కూడా మేమే ధరిస్తాం. మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగళగిరి సుహాసిని గారు పొంగళ్లు, పిండివంటలు వంటివి చేయించి అందరికీ పంచుతారు. మన సంస్కృతిలో పండగల ఔచిత్యాన్ని తెలియజేస్తారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తారు. దామెర్ల నరసింహారావు మాస్టారుతో కలసి మా టీచర్లంతా వీటిని నిర్వహిస్తుంటారు. **- ఎన్.హేమ, కె.మణిమౌనిక, వి.లలితా భవాని,**
9వ తరగతి, కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.

నేను గీసిన బొమ్మ



వై.ఉన్నతి,
5వ తరగతి,
జెమినీ స్కూలు,
బ్రాడీపేట,
గుంటూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



సమిష్టితత్వం .. సంక్రాంతి గుణం ...

ఊళ్లు జనంతో కళకళ్లాడుతున్నాయి. నిండా నీళ్లు పారుతున్న నదిలా తళతళా మెరుస్తున్నాయి. మనుషుల కళ్ల నిండా కాంతులు కురుస్తున్నాయి. పలకరింపుల పర్వంతో పులకరించిపోతోంది ఊరు. సంక్రాంతి అంటే అందరికీ పండగే కానీ, ఊరికి మరీ ప్రత్యేకం. ఎందుకంటే- ఈ పండక్కి పుట్టుకనిచ్చిందే ఊరు. జన్మనిచ్చిన ఊరిని పలకరించిపోదామని ఏడాదికొకసారి సందడిగా వస్తుంది సంక్రాంతి. ఊరి నుంచి వెళ్లిన పిల్లలను, ఆ పిల్లల పిల్లలను వెంటబెట్టుకొని వేంచేస్తుంది. ఊరందరూ వస్తేనే ఊరంత సంబరమని సంక్రాంతికి తెలుసు. పేరుకే తాను సంక్రాంతి. ఆ కళాకాంతులు తెచ్చేదీ, పెద్ద పండగగా నిలిపేదీ- పల్లె పొదుగున చేరే పిల్లాపెద్దలు అందరూ! తాను వచ్చానని అనేకనేక ఊళ్ల నుంచి, పట్టణాల నుంచి పిల్లాపాపలతో అందరూ ఉత్సాహంగా వస్తారు. వాళ్లంతా అలా రావడంతోనే తాను వచ్చినట్టు అవుతుంది.

సంక్రాంతిని అందరూ ప్రేమిస్తారు. అందరూ అభిమానిస్తారు. పండగ నెపంతో పిల్లలందరూ వస్తారని అమ్మలందరూ ఎదురుచూస్తారు. పండగ పేరుతో తృణమో ఫణమో దక్కుతుందని అక్కడక్కడా మిగిలిన హరిదాసులు, బుడబుక్కలు, కొమ్మ దాసర్లు, గంగిరెద్దుల వారు పాత సరంజామాను సర్దుకొని ప్రతి ఇంటి వాకిట్లో పాటై మోగుతారు. పలుకై వినిపిస్తారు. పండగను వీధివీధినా ఊరేగిస్తున్నందుకు గృహస్తులు ఉత్సాహపడతారు. అమ్మకాలు పెరిగి, ఆదాయం చేకూరుతుందని అన్ని రకాల వ్యాపారులు ముందునుంచీ పండగను కలవరిస్తారు. సెలవులు వచ్చినందుకు పిల్లలు సంతోషపడతారు. అమ్మమ్మ వాళ్ల ఊరు వెళుతున్నందుకు ఉప్పొంగిపోతారు.

రంగురంగుల ముగ్గులతో తమను అందంగా అలంకరిస్తున్నందుకు వీధులు ముచ్చటపడతాయి. ఏడాది మొత్తంలో ఎప్పుడూ లేనంతమంది అటూ ఇటూ ఉల్లాసంగా తిరుగాడుతున్నందుకు కళకళ్లాడతాయి. అన్ని ఇళ్లూ పిండివంటలతో ఘుమఘుమలాడతాయి. ఏ ఇంటికి వెళ్లినా ఆప్యాయ పలకరింపులు నిండుగా ఉంటాయి. కొత్త అల్లుళ్లకు ప్రత్యేక మర్యాదలు లభిస్తాయి. పెళ్లి సందడిలో అంతగా పట్టించుకోవటం వీలవ్వని బాంధవ్యాలు ఈ పండక్కే బలంగా అల్లుకుంటాయి. అల్లరి పిల్లలకు గొప్ప ధైర్యాన్నిచ్చే పండగ ఇది. అమ్మ గదమాయింపులను, నాన్న క్రమశిక్షణలను లెక్క చేయనవసరం లేదు. అమ్మమ్మ, తాతయ్య, మామయ్య, పెద్దమ్మ, అత్తలు తదితర బహుముఖ బలగం వారికి అండగా ఉంటుంది. ఏది కావాలన్నా, ఏది తినాలన్నా, ఎక్కడ తిరగాలన్నా ఎక్కువ చెల్లుబాటుకు సంక్రాంతి అవకాశం ఇస్తుంది.

ఉపాధి కోసం, ఉద్యోగం కోసం ఎక్కడెక్కడికో తరలిపోయిన మిత్రులంతా వచ్చి వాలతారు. పదిమందీ కలవడం, పాత జ్ఞాపకాలను పలవరించటం సంతోషాల్లోకెల్లా సంతోషకరమైన వ్యాపకం. తిరుగాడిన దారులూ, ఈతకొట్టిన వాగులూ, చదువు నేర్పిన బడులూ, తచ్చాడిన తావులూ ... మళ్లీ వచ్చిన మిత్ర బృందాలను చూసి పరిమళిస్తాయి. ఆనాటి కథలూ, కలలూ, అల్లరి పనులూ మళ్లీ మళ్లీ ప్రతిధ్వనించి పరవశిస్తాయి. స్నేహితుల, బంధువుల పిల్లలు పరస్పరం పరిచయం అవుతారు. ఆటలతో, మాటలతో మమేకమవుతారు.




కోడిపందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, తీర్థాలు, బండలాగుడు వినోదాలు, పశువులకు అలంకరణలు ... ఊరినిండా ఉత్సాహ వాతావరణాన్ని నింపుతాయి. అన్ని వయసుల వారికి, అన్ని వీధుల వారికీ కళ్ల నిండా వినోదం, మనసు నిండా ఉత్సాహం ఉరకలెత్తుతాయి. పలకరించుకోవడం, ఇచ్చిపుచ్చుకోవడం, పరస్పరం సహకరించుకోవడం, ఇంటిల్లిపాదీ కలిసి భుజించటం ... వంటి సమిష్టితనపు గొప్పతనాన్ని, ఆనందాన్ని సంక్రాంతి అందరికీ పరిచయం చేస్తుంది. పూజలూ పునస్కారాల్లోనో, ఆస్తుల ఆడంబరాల్లోనో కాదు; మనుషులందరూ కలసి మెలసి ఉండడంలోనే సందడి ఉంది. పండగ ఉంది. ఆనందం ఉంది. ఇంత గొప్ప పాఠం చెప్పే సంక్రాంతి నిజంగానే పెద్ద పండగ. ఉత్పత్తిలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ, ప్రతి జీవికి, ప్రతి పరికరానికి ప్రణమిల్లే పండగ. ఏడాది మొత్తానికి ఎనర్జీనిచ్చే పండగ. వచ్చే సంక్రాంతి దాకా ఎదురుచూసేంత ఆనందానుభూతులను ప్రసాదించే పండగ.

- శాంతిమిత్ర



రంగవల్లి



23 చుక్కలు, 23 వరుసలు, 1 వచ్చేవరకు



లక్ష్మి భార్గవి,
కర్మన్ ఘాట్, హైదరాబాద్.

15 చుక్కలు 15 వరుసలు (సరిచుక్క)



ఎం. ధనలక్ష్మి,
కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ,
నెల్లూరు.





సిహెచ్. ఇందుసాయి,
చాంపియన్ స్కూలు,
సూళ్లూరుపేట,
నెల్లూరు జిల్లా.



21 చుక్కలు 1 వచ్చేవరకు (సరిచుక్క)

14 చుక్కలు 14 వరుసలు (సరిచుక్క)





ఎర్ర పద్మావతి
బుచ్చిరెడ్డిపాలెం
నెల్లూరు జిల్లా

ఈ రోజు రంగవల్లులతో 'రంగవల్లి' ముగిసింది. పంపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. - ఎడిటర్

ఛాంపియన్స్ ట్రోఫీకి

జట్టు కూర్పు కోసం కసరత్తు

- బుమ్రా, కుల్దీప్ ఫిట్‌నెస్‌పైనే దృష్టి
- దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల ప్రకటన



ముంబయి: వచ్చే నెల 19నుంచి పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో ఆటగాళ్ల కూర్పుపై బిసిసిఐ కసరత్తు ప్రారంభించింది. ఈ టోర్నీలో ఆడే జట్లు ఒక్కొక్కటి తమ తమ జట్లను ప్రకటిస్తుండగా.. బిసిసిఐ మాత్రం బుమ్రా, కుల్దీప్‌ల ఫిట్‌నెస్ రిపోర్ట్ కోసం వేచిచూస్తోంది. ఈ టోర్నీలో ఆడే ఐదు జట్లు ఇప్పటికే తమ జట్లను ప్రకటించగా.. ఆతిథ్య పాకిస్థాన్, భారత్ ఇంకా వెల్లడించలేదు. జనవరి 12 నాటికే ప్రాబబుల్స్‌ను ప్రకటించాల్సి ఉండగా.. టోర్నీ ప్రారంభానికి నెల రోజుల ముందు అంటే జనవరి 19లోగా స్క్వాడ్‌ను ప్రకటిస్తుందని సమాచారం. టోర్నీకి వారం రోజుల ముందు వరకూ మార్పులు చేసుకొనే అవకాశం ఉంది. అయితే, టీమిండియా మాత్రం పేసర్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ ఫిట్‌నెస్ రిపోర్టు రాగానే జట్టును ప్రకటించాలని చూస్తోంది. గత వారం చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్, గౌతమ్ గంభీర్ సమావేశమై జట్టు కూర్పుపై ఒక అంచనాను వచ్చినట్లు తెలిసింది. బుమ్రా వెన్నునొప్పితో ఇబ్బందిపడుతున్నాడు.

కుల్దీప్‌కే తొలి ప్రాధాన్యత..

గతేడాది అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ ఆడిన కుల్దీప్ ఆ తర్వాత జట్టుకు దూరమయ్యాడు. గజ్జల్లో గాయం కారణంగా సుదీర్ఘకాలం విశ్రాంతి తీసుకున్నాడు. అనంతరం సర్జరీ కూడా చేయించుకుని, జాతీయ క్రికెట్ అకాడమీలో ఫిట్‌నెస్‌పై సాధన చేశాడు. ఈ నెలాఖరుకు అతడు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ జట్టులోకి స్థానం కల్పించి.. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిస్తారని తెలుస్తోంది. చైనామన్ స్పిన్నర్‌గా దుబాయ్ పిచ్‌పై కుల్దీప్ కీలకపాత్ర పోషిస్తాడనేది బిసిసిఐ అంచనా.

దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా బవుమా

మినీ ప్రపంచకప్‌గా భావించే ఛాంపియన్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా క్రికెట్‌బోర్డు జట్టును ప్రకటించింది. బవుమా నాయకత్వంలోని సఫారీ జట్టుకు గాయాలతో జాతీయ జట్టుకు దూరమైన ఫాస్ట్ బౌలర్లు లుంగీ ఎంగిడీ, అన్రిచ్ నోర్జేను సైతం ఎంపికయ్యారు. జట్టుల్లో ఐదుగురు ఫాస్ట్ బౌలర్లు, ముగ్గురు స్పిన్నర్లకు అవకాశం ఇచ్చిన బోర్డు... బవుమా నాయకత్వంపై గంపెడాశలతో ఉంది. ఇటీవల బవుమా సారథ్యంలోని దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు చేరుకుంది. గ్రూప్-బిలో దక్షిణాఫ్రికాతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఆఫ్ఘనిస్తాన్ ఉన్నాయి. ఫిబ్రవరి 19న చాంపియన్స్ ట్రోఫీ మొదలుకా నుండగా... ప్రొటీస్ జట్టు తొలి మ్యాచ్‌ను 21న కరాచీలో ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడుతుంది. ఆ తర్వాత 25న రావల్పండిలో ఆస్ట్రేలియాతో, మార్చి 1న ఇంగ్లండ్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడుతుంది.

ఇద్దరు స్పిన్నర్లతో ఆస్ట్రేలియా కూడా..

చాంపియన్స్ ట్రోఫీకి క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) కూడా జట్టును ప్రకటించింది. 15మంది సభ్యులతో కూడిన జట్టు కెప్టెన్‌గా పాట్ కమ్మిన్స్ ఎంపికయ్యాడు. పేసర్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్‌కు సైతం జట్టులో చోటు దక్కింది. ఇద్దరు రెగ్యులర్ స్పిన్నర్లకు ఆసీస్ జట్టులో చోటు దక్కింది. జట్టులో ఆల్‌రౌండర్లు, ఫాస్ట్ బౌలర్లతో పాటు స్టార్ బ్యాటర్స్‌తో జట్టు పటిష్టంగా కనిపిస్తోంది.

దక్షిణాఫ్రికా జట్టు: బవుమా(కెప్టెన్), జోర్జీ, జాన్సెన్, క్లాసెన్, మహారాజ్, మార్క్‌రమ్, మిల్లర్, ముల్డర్, ఎన్గిడీ, నోర్జే, రబాడా, రికెల్టన్, షాంసి, స్టబ్స్, వాన్ డెర్ డస్సెన్.

ఆస్ట్రేలియా జట్టు: కమ్మిన్స్(కెప్టెన్), క్యారీ(వికెట్ కీపర్), ఎల్లిస్, హార్డీ, హేజిల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, లబూషేన్, మార్ష్, మాక్స్‌వెల్, షార్ట్, స్మిత్, జంపా, స్టొయినిస్, స్టార్క్.

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

అల్కరాజ్, జకోవిచ్ సునాయాసంగా..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో కార్లోస్ అల్కరాజ్, నొవాక్ జకోవిచ్ సునాయాసంగా విజయాన్ని సొంతం చేసుకున్నారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో అల్కరాజ్ 6-1, 7-5, 6-1తో కజకిస్తాన్‌కు చెందిన షెవ్‌ఛెవ్‌నికోను చిత్తుచేశాడు. రెండోసెట్ మినహా.. మిగిలిన సెట్లు ఏకపక్షంగా కైవసం చేసుకున్నాడు. ఇక 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్ 4-6తో తొలి సెట్‌ను కోల్పోయినా.. ఆ తర్వాత 6-3, 6-4, 6-2తో మిగిలిన మూడుసెట్లను కైవసం చేసుకొని రెండోరౌండ్‌కు చేరాడు. ఇక 10వ సీడ్ డిమిత్రోవ్(ఇటలీ) గాయం కారణంగా అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే వైదొలిగాడు. డిమిత్రోవ్ 5-7, 1-2తో వెనుకబడి ఉన్న దశలో గాయంతో నిష్క్రమించాడు. ఇక ఐదుసెట్ల హోరాహోరీ పోరులో 12వ సీడ్, అమెరికాకు చెందిన టామీ పాల్ విజయం సాధించాడు. పాల్ 6-2, 3-6, 6-1, 6-7(5-7), 7-5తో కానెల్(ఆస్ట్రేలియా)ను చిత్తుచేశా డు. మరో ఆసీస్ సంచలన ఆటగాడు కిర్గియోస్ 6-7(2-7), 3-6, 6-7(2-7)తో ఫెర్మీ(ఇంగ్లండ్) చేతిలో పోరాడి ఓడాడు. ఇతర పోటీల్లో 22వ సీడ్ కొర్డా(అమెరికా), 15వ సీడ్ డ్రాపర్(బ్రిటన్) ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్‌కు చేరారు.



జకోవిచ్‌కు గట్టి పోటీ ఇచ్చిన భారత సంతతికి చెందిన అమెరికా యువ ఆటగాడు బసవారెడ్డి

సీడెడ్ల ముందంజ..

మహిళల సింగిల్స్‌లో సీడెడ్ క్రీడాకారిణులు ప్రత్యర్థులపై సునాయాసంగా విజయం సాధించి రెండోరౌండ్‌కు చేరారు. 10వ సీడ్ కోలిన్స్(అమెరికా) 7-6(7-4), 6-3తో స్నిగుర్(ఉక్రెయిన్)పై, 20వ సీడ్ ముఛోవా(చెక్) 6-1, 6-1తో పొడొరొస్కా(అర్జెంటీనా)పై విజయం సాధించారు. మరో పోటీలో 7వ సీడ్ పెగూల(అమెరికా 6-3, 6-0తో ఆస్ట్రేలియాకు చెందిన జాయింట్‌ను చిత్తుచేసింది. ఇక జపాన్ సంచలనం నవోమీ ఒసాకా మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఫ్రాన్స్‌కు చెందిన గార్షియాను చిత్తుచేసింది. ఒసాకా 6-3, 3-6, 6-3తో గార్సియాపై గెలిచింది. ఇక 2వ సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్) 6-3, 6-4తో సినికోవా(చెక్)ను, 27వ సీడ్ పావెంచికోవా(రష్యా) 6-4, 4-6, 6-3తో యువాన్(చైనా)ను ఓడించి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68